teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 355 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 28 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి

రాష్ట్ర సమస్యలపై కేసీఆర్ ట్విట్టర్ (x) లో ట్వీట్



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు. శనివారం ఎక్స్ ఖాతా తెరిచిన కేసీఆర్. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. మహబూబ్ నగర్ పర్యటనలో ఉన్న కేసీఆర్ కరెంట్ కోతలపై ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది. ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప

మిగతా 2 లో



# ఏప్రిల్ 30న పది ఫలితాలు

ఉదయం 11గం.కు ఫలితాల విడుదలకు రంగం సిద్ధం

తెలంగాణ విద్యాశాఖ అధికారిక ప్రకటన విడుదల

పూర్తైన ఫలితాల డీకోడింగ్ ప్రక్రియ



తెలంగాణ పదోతరగతి పరీక్ష ఫలితాలను ఏప్రిల్ 30న విడుదల చేసేందుకు సర్వం సిద్ధం చేశారు అధికారులు. దీనిపై తెలంగాణ విద్యాశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు ఫలితాల కోసం గత కొన్ని రోజులుగా ఎదురు చూస్తున్నారు.

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): ఏపీలో ఇప్పటికే టెన్త్ క్లాస్ ఎగ్జామ్ రిజల్ట్స్ విడుదల చేశారు అధికారులు. అయితే తెలంగాణలోనూ పదవ తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేసేందుకు సిద్ధమైంది తెలంగాణ విద్యాశాఖ. రాష్ట్ర వ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు

మిగతా 2 లో



## రిజర్వేషన్ రహిత హిందూదేశంగా మార్చాలని ఆరెస్సెస్ చెప్పింది

ఇందుకోసమే బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): 2025తో ఆరెస్సెస్‌ను స్థాపించి వందేళ్లవుతుందని ఈలోగా భారత్‌ను రిజర్వేషన్ రహిత హిందూదేశంగా మార్చాలని ఆరెస్సెస్ ఎప్పుడో చెప్పిందని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇందుకోసమే బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. బలహీనవర్గాలపై మోదీ, అమిత్ షా సర్జికల్ స్ట్రైక్స్

మిగతా 2 లో

## రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ

సినీ నటుడు బాబూమోహన్ తోపాటు పలువురి నామినేషన్ల తిరస్కరణ

267 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాల తిరస్కరణ

నిబంధనల మేరకు ఉన్నవి 626 అభ్యర్థుల నామినేషన్ పేపర్లు

ప్రకటన విడుదల చేసిన ఎన్నికల అధికారులు




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో పలు రాష్ట్రాల్లో పోలింగ్ పూర్తి కాగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో నాలుగో విడతలో పోలింగ్ జరగనుంది. వచ్చే నెల అనగా మే 13 న రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక ఎలక్షన్‌లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆయా నియోజకవర్గాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలిన ప్రక్రియ కూడా శుక్రవారం ముగిసింది. ఇక ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు

మిగతా 2 లో



## కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతు కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బీజేపీని ఓడించేందుకు సహకరిస్తామని సీపీఎం నేతల హామీ

హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భువనగిరితో పాటు ఇతర పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఎం రాష్ట్ర శాఖ మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం , వీరయ్య, జూలకంటి రంగారెడ్డి తదితరులతో సహా సిపిఎం రాష్ట్ర శాఖ నాయకులతో ఆయన శనివారం తన నివాసంలో సమావేశమయ్యారు. భువనగిరితో పాటు ఇతర

మిగతా 2 లో



## ఫోన్ ట్యాపింగ్‌లతో కేటీఆర్ హీరోయిన్లను బ్లాక్ మెయిల్

కేటీఆర్ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆరోపణలు

కేటీఆర్ పై పార్టీ నేతలు ఈసీకి ఫిర్యాదు

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎన్నికల సంఘం హెచ్చరికలు జారీ చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఎన్నికల కమిషన్ తీవ్రంగా తప్పుపట్టింది. కొండా సురేఖ ఎన్నికల నియామవళిని ఉల్లంఘించారని ఈసీ పేర్కొంది. అంతేగాక, ఎన్నికల కోడ్ ముగిసే వరకు జాగ్రత్తగా మాట్లాడాలని కొండా సురేఖను హెచ్చరించింది. ఇతర పార్టీలను, నేతలు విమర్శించేటప్పుడు కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా, మంత్రిగా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. ఏప్రిల్ 1న వరంగల్‌లో మీడియా

మిగతా 2 లో

## హరీశ్ రావు రాజీనామా పత్రం ఇవ్వడం ఓ డ్రామా



రాజీనామాపై డొంక తిరుగుడు మాటలు మాట్లాడవద్దు

రైతు రుణమాఫీ పై రాజీనామా చేస్తానన్న మాటకు కట్టుబడి ఉండు

హరీష్ రావు వాఖ్యలను ఎద్దేవ చేసిన కడియం శ్రీహరి

వివరాలు 2 లో

## పదేండ్లలో చేయలేని పనులను 3 నెలల్లో చేయమనడం హాస్యాస్పదం

మోసం చేయడంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ సంపదను కొల్లగొడుతున్నారు

తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ ఆరోపణలు



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): మోసం చేయడంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజల సంపదను కొల్లగొట్టారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ చేయలేని పనులను 3 నెలల్లో చేయాలన్న

మిగతా 2 లో

## కాంగ్రెస్ నాయకులకు బండి సంజయ్ సవాల్

ఆరు గ్యారంటీల అమలును నిరూపించాలని వాఖ్యలు

నిరూపిస్తే కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తా



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ నాయకులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సవాల్ చేశారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో మహిళలకు రూ.2500, ఆసరా

మిగతా 2 లో

## ఏప్రిల్ 30న పది ఫలితాలు

**మొదటి పేజీ తరువాయి**

పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపు 2,676 పరీక్ష కేంద్రాలలో ఎగ్జాన్స్ నిర్వహించింది విద్యాశాఖ. అక్కడక్కడా కొన్ని మాల్ ప్రాక్టీసింగ్ సంఘటనలు చవిచూసినటప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా సజావుగా పరీక్షలను నిర్వహించారు. పదో తరగతి ఫలితాలు విడుదలైన మరుక్షణంలో అధికారిక వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ హాల్ టికెట్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలను నమోదు చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. 2024 టెన్త్ క్లాస్ రిజల్ట్స్‌ను వెబ్సైటులో కూడా చెక్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫలితాల డీకోడింగ్ ప్రక్రియ దాదాపు పూర్తైంది కావున ఏప్రిల్ 30న ఉదయం 11 గంటలకు ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసింది విద్యాశాఖ. గతంలో ఇంటర్ ఫలితాల విడుదలకు అనుమతి కోరుతూ ఎన్నికల అధికారులను ఇంటర్ బోర్డు లేఖరాసింది. ఇదే క్రమంలో పదో తరగతి పరీక్ష ఫలితాల వెల్లడికి అనుమతి కోరుతూ ఎన్నికల సంఘానికి విద్యాశాఖ లేఖ రాసింది. తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అందుకే ఆయా శాఖల మంత్రుల చేతుల మీదుగా పరీక్షా ఫలితాలను విడుదల చేసేందుకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అడ్డు వస్తుంది. కావున విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం టెన్త్ క్లాస్ పరీక్షా ఫలితాలను విడుదల చేయనున్నారు.

## కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతు కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

లోక్‌సభ నియోజకవర్గాల్లో మద్దతు కోరడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ మరికొన్ని రాజకీయ ప్రతిపాదనలను సీపీఎం నేతల ముందు ఉంచిందని సమావేశం అనంతరం ముఖ్యమంత్రి తెలిపారు. రెండు అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి, అదే పార్టీ కమాండ్‌తో చర్చించబడుతుంది. రేపటిలోగా ఏకాభిప్రాయం వస్తుంది అని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీని ఓడించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని సీపీఎం నేతలు హామీ ఇచ్చారు. భారత కూటమి కింద పని చేస్తామని కూడా వారు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఈ సమావేశం మార్గం సుగమం చేస్తుందని ఆయన అన్నారు. భువనగిరి నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థి మహమ్మద్ జహంగీర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు, పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు తదితరులున్నారు. అయితే, ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మా అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని అభ్యర్థించారు. బీజేపీను ఓడించేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వీరభద్రం తెలిపారు. గత వారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సీపీఎం రాష్ట్ర శాఖ నేతలతో సహా వామపక్ష పార్టీల నేతలతో సమావేశమయ్యారు. వామపక్ష పార్టీల నేతలు లేవనెత్తిన అన్ని అంశాలపై పార్టీ హైకమాండ్‌తో చర్చించి తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని సమావేశం అనంతరం ఆయన చెప్పారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు.

## రిజర్వేషన్ రహిత హిందూదేశంగా మార్చాలని ఆరెస్సెస్ చెప్పింది

**మొదటి పేజీ తరువాయి**

చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లోనేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 400 లోక్ సభ స్థానాల్లో గెలిస్తే ఎవరి అవసరం లేకుండా రిజర్వేషన్లను రద్దు చేయవచ్చునేది బీజేపీ కుట్ర అని ఆరోపించారు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే బీసీ జనాభాను లెక్కించి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. అరెస్సెస్ భావజాలం మనువాదభావజాలం కోసం బీజేపీ 400 సీట్లు కోరుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేసి హిందూ దేశంగా మార్చాలనేది బీజేపీ కుటిలయత్నమన్నారు. బీసీ రిజర్వేషన్లు పెరగాలంటే జనాభా లెక్క కావాలని అందుకు కాంగ్రెస్ సిద్ధమన్నారు. కానీ ఏదో రకంగా రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కాంగ్రెస్ ప్రశ్నలకు మోదీ, అమిత్ షాలు సమాధానం చెప్పడం లేదన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామంటే కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ ఒక్క మాట మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్ కూడా రిజర్వేషన్ల రద్దు అంశంపై మాట్లాడటం లేదన్నారు. జైల్లో ఉన్న బిడ్డ కోసం బీజేపీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి, పోవాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సాక్షిగా చెబుతున్నానని పంద్రాగస్ట్ లోగా రుణమాఫీ చేస్తానని పునరుద్ఘాటించారు. హరీశ్ రావులాంటి వ్యక్తులు రాజీనామా చేస్తే పీడ పోతుందన్నారు. మల్కాజ్‌గిరి లోక్ సభ సీటు నుంచి ఈటల రాజేందర్ గెలుస్తారని మాట్లాడిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ సమర్థించడం విడ్డూరమని రేవంత్ విమర్శించారు. నిన్నటికి నిన్న మల్లారెడ్డి అత్యుత్సాహంతోనో అమాయకంగానో ఈటెల రాజేందర్ గెలుస్తున్నాడని చెప్పాడని గుర్తు చేశారు. బీజేపీతో కనుక బీఆర్ఎస్ పార్టీకి నిజంగానే వైరం ఉంటే మల్లారెడ్డి వెంటనే కేటీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మల్లారెడ్డిని సస్పెండ్ చేయకపోగా ఆయన వ్యాఖ్యలను కేటీఆర్ సమర్థించారని మండిపడ్డారు. గత లోక్ సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి తనను ఓడించేందుకు 31 సమావేశాలు పెట్టారని ఇప్పుడు ఒక్క సభ కూడా పెట్టలేదన్నారు. ఐదు స్థానాల్లో బీజేపీని గెలిపించడం కోసం కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈటల గెలుస్తారని చెప్పి మల్లారెడ్డి ఉన్నది ఉన్నట్లు చెప్పి కుండ పగులగొట్టారన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే అలా మాట్లాడితే కనీసం షోకాజ్ నోటీసు ఇవ్వలేదని వివరణ కూడా అడగలేదన్నారు. అలాంటి కేటీఆర్ బీజేపీని ఓడిస్తానని రంకెలు వేయడం విడ్డూరమన్నారు. ఇప్పటి వరకు ఈటల రాజేందర్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లను ఏమీ అనడం లేదని, బీఆర్ఎస్ అగ్రనాయకులు కూడా ఈటెలను ఏమీ అనడం లేదన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌లతో కేటీఆర్ హీరోయిన్లను బ్లాక్ మెయిల్

**మొదటి పేజీ తరువాయి**

సమావేశంలో కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌లతో ఎంతోమంది హీరోయిన్లను బ్లాక్ మెయిల్ చేశాడని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఎంతో మంది అధికారులను బలిచేసి వారు ఉద్యోగాలు కోల్పోయి జైలుకు వెళ్లేలా చేశారని కొండా సురేఖ అన్నారు. అధికారం లేకనే కేసీఆర్, కేటీఆర్ కొత్త డ్రామాలకు తెర తీశారని సురేఖ విమర్శించారు. ఇప్పటికే మీ సోదరి శ్రీకృష్ణ జన్మస్థానం వెళ్లారంటూ కవితనుద్దేశించి కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు కొండా సురేఖ. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలపై ఆ పార్టీ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎన్నికల కమిషన్. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా నివేదిక తెప్పించుకుంది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను జిల్లా ఎన్నికల అధికారి ఇంగ్లీషులోకి అనువదించి పంపించారు. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను పరిశీలించిన ఎన్నికల ఆమెకు హెచ్చరికలు జారీ చేసింది. జైలుకు వెళ్లడం ఖాయమన్న భయంతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారన్న మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను కూడా ఈసీ పరిగణలోకి తీసుకుంది. ఇలాంటి నిరాధార ఆరోపణలు ప్రతిపక్ష పార్టీ, నేత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఎన్నికల ప్రక్రియకు అంతరాయంగా ఉన్నాయని ఈసీ వ్యాఖ్యానించింది. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని ఇక ముందు జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖను ఈసీ హెచ్చరించింది. అయితే, తాజాగా, కూడా కేసీఆర్, కేటీఆర్ లపై కొండా సురేఖ విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్ లు జైలుకెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు.

## వాళ్లు దేశభక్తులు మేము దేశద్రోహులమా

**దేవుళ్ల పేరుతో బీజేపీ నాయకుల రాజకీయం**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**



ఆసిఫాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): దేవుళ్ల పేరుతో బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, వాళ్లు దేశభక్తులు మేము దేశద్రోహులమా అని రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొనే ప్రసంగించారు. బీజేపీ నాయకులు జైశ్రీరామ్ అంటూ దేవులను బయటకు తెస్తూ రాజకీయం చేస్తున్నారని, పదేళ్ల కేంద్రం ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీం లను కచ్చితంగా అమలు చేస్తుందని తెలిపారు. అదిలాబాద్ జిల్లాలో ఉన్న ప్రాణహిత చేవెళ్ల, కడెం, ఎస్సారెస్పీ ప్రాజెక్టు పనులను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం పేదలపై పన్నులు వేస్తూ దుర్మార్గ పరిపాలన చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం టాక్స్ టెర్రరిజం చేస్తుందన్నారు. ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నైజం రేవంత్ రెడ్డికి ఉందన్నారు. ప్రభుత్వాన్ని కూల్చే ధైర్యం ఎవరికీ ఉందన్నారు. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచుతామన్నారు. మాజీ మంత్రి హరీష్ రావుకు పదవి మీద తప్ప ప్రజల మీద ధ్యాస లేదన్నారు. కాంగ్రెస్ నాయకులను హేళన చేయడం తప్ప ఆయన చేసింది ఏం లేదని మంత్రి సీతక్క మండిపడ్డారు.

# రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి**

జరగనుండగా తెలంగాణలో మాత్రం లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకు ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు కలిపి 893 మంది నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలిన ప్రక్రియ ముగియగ మొత్తం నామినేషన్లు వేసిన వారిలో 267 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలను వివిధ కారణాలతో తిరిస్కరించారు. 626 మంది నామినేషన్ పేపర్లు నిబంధనల మేరకు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో అధికారులు ఈ స్క్రూట్నీ ప్రక్రియను నిర్వహించారు. ఈ క్రమంలో వరంగల్ స్థానం నుంచి చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేసిన మాజీ మంత్రి బాబూ మోహన్ నామినేషన్‌ను అధికారులు రిజెక్ట్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో






భాగంగా బాబు మోహన్ వరంగల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా అధికారులు తిరస్కరించారు. 10 మంది ప్రతిపాదకుల పేర్లు ప్రస్తావించి నప్పటికీ బాబు మోహన్ నామినేషన్‌లో ఎవరూ సంతకాలు చేయకపోవడం అఫిడవిట్‌లో నిర్దిష్ట ఖాళీలు ఉన్నాయని ఆర్వో వెల్లడించారు. ఈ కారణాలతో ఆయన నామినేషన్‌ను రిజెక్ట్ చేసారు. అలానే నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు నామినేషన్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ ఎన్నికల్లో ఆయన కుమారుడికి బీజేపీ టికెట్ కేటాయించగా రాములు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బీఫాం లేకపోవడంతో ఆయన నామినేషన్‌ను ఎన్నికల అధికారులు రిజెక్ట్ చేసారు. ఇక ఇదే నియోజకవర్గంలో మాజీ ఎంపీ మందా జగన్నాథం వేసిన నామినేషన్ కూడా రిజెక్ట్ అయింది. ఆయన బీఎస్పీ నుంచి నామినేషన్ వేసినా బీఫాం లేకపోవటంతో అధికారులు తిరసక్కరించారు. అక్కడ మరో అభ్యర్థి బీఎస్పీ బీఫాంను సమర్పించారు. స్క్రూట్నిలో తిరస్కరణకు గురైన నామినేషన్లలో అత్యధికంగా మల్కాజిగిరి నుంచి 77 ఉన్నాయి. ఆ తర్వాత నల్గొండ నుంచి 25, కరీంనగర్ 20, హైదరాబాద్ 19, చేవెళ్ల 17, పెద్దపల్లి, జహీరాబాద్‌లలో 14 చొప్పున, నాగర్‌కర్నూల్ 13, సికింద్రాబాద్ 11, నిజామాబాద్, భువనగిరి, వరంగల్, ఆదిలాబాద్‌లలో 10 చొప్పున, మహబూబ్‌నగర్‌లో 7, మహబూబాబాద్‌లో 5, ఖమ్మంలో 4, మెదక్‌లో ఒకరి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు.

## ఏసీబీకి చిక్కిన ఇన్ ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్

**గిఫ్ట్ భూమి రిజిస్ట్రేషన్ కు రూ. 10 వేలు డిమాండ్**

**మొన్న తస్లీమా.. నేడు సురేష్**



కరీంనగర్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): కరీంనగర్ జిల్లా గంగాధర ఇన్ ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్ సురేష్ బాబు ఏసీబీకి చిక్కారు. రేకుర్తికి చెందిన అంజయ్య అనే వ్యక్తి తన స్నేహితుడు అజయ్ కుమార్ కు అతని తండ్రి ద్వారా గిఫ్ట్ గా వచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రూ. 10 వేలు డిమాండ్ చేశారు. దీంతో అంజయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ఆఫీసు సబార్డినేట్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా పదివేలు తీసుకుంటుడగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ తీసుకోమంటేనే తీసుకున్నానని శ్రీధర్ తెలుపడంతో ఏసీబీ అధికారులు ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పర్చనున్నామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

**ఔట్ సోర్సింగ్ ఎంప్లాయ్**

లంచం తీసుకునే అధికారులు మరొకరి ద్వారా డబ్బులు తీసుకునే ప్రక్రియ మొదలు పెట్టడంతో అనామకులు బలవుతున్నారు. పెద్ద సారే దగ్గర అయ్యాడన్న ధీమాతో లంచం తీసుకునేందుకు సాహసిస్తే కటకటాల పాలుకాక తప్పడం లేదు. గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శనివారం ఇన్ ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్ సురేష్ కోసం లంచం డబ్బులు తీసుకుంటూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్ కూడా కేసులో ఇరుక్కున్నాడు. కుటుంబ పోషణ కోసం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగం చేస్తున్న నిరుద్యోగులు అధికారుల కనుసన్నల్లో దారి తప్పుతుండడమే వారి పాలిట శాపంగా మారింది. ఏసీబీ కేసు క్లోజ్ అయ్యే వరకూ కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తయారు కాగా వీరిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడక తప్పడం లేదు.

**మొన్న తస్లీమా.. నేడు సురేష్**

సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అవినీతి అధికారులకు అడ్డాలుగా మారాయి. ఇటీవల మహబూబాబాద్ లో లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఏసీబీకి చిక్కగా సోదాల్లో భారీ మొత్తంలో అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. ఆ సంఘటన మరిచిపోక ముందే తాజాగా గంగాధర లో ఇన్ ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కడం కలకలం సృష్టిస్తుంది. చేతికి అవినీతి మరక అంటకుండా సురేష్ బాబు జాగ్రత్త పడ్డా, అవినీతి నిరోధక శాఖ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. ధరణి వెబ్ సైట్ అందుబాటులోకి వచ్చాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ లు తహశీల్దార్ కార్యాలయంలోనే జరుగుతుండగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం తగ్గింది. హౌస్ సైట్స్ మాత్రమే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో రిజిస్ట్రేషన్ జరుగుతుండగా అందుకోసం వచ్చిన వారి నుంచి అందినకాడికి దండుకునే పనిలో సబ్ రిజిస్ట్రార్ లు ఉన్నారు. అందులో భాగంగానే మొన్న తస్లీమా నస్రీన్, నేడు సురేష్ బాబు ఏసీబీకి చిక్కినట్లు తెలుస్తుంది.

**రూ.4 లక్షల లంచం**

రూ.4 లక్షల లంచం తీసుకుంటూ నీటిపారుదల శాఖ, బుద్ధ భవన్ నార్త్ ట్యాంక్స్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాత పవన్ కుమార్ ఏసీబీకి చిక్కారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064 కి కాల్ చేయమని ఏసీబీ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ నాయకులకు బండి సంజయ్ సవాల్

**మొదటి పేజీ తరువాయి**

పెన్షన్ రూ.4 వేలు, విద్యార్థి భరోసా ఇచ్చామని నిరూపించండి అని ఛాలెంజ్ చేశారు. నిరూపిస్తే తాను పార్లమెంట్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు. నిరూపిస్తే కాంగ్రెస్ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో స్వయంగా నేనే ప్రచారం చేస్తా అని షాకింగ్ కామెంట్స్ చేశారు. నిరూపించకపోతే మీరు పోటీ నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. నా సవాల్‌ను స్వీకరించే దమ్ము కాంగ్రెస్‌లో ఏ నాయకుడికైనా ఉందా? అని అడిగారు. కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలే నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. అసలు దేశాన్ని నడిపించే నాయకుడు, ప్రధాని అయ్యే క్వాలిటీస్ ఉన్నా అభ్యర్థి కాంగ్రెస్‌లో ఉన్నారా? అని ప్రశ్నించారు. కనీసం పీఎం అభ్యర్థి ఎవరో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో తనకు ఎవరూ పోటీ కాదని అన్నారు. ఆ రెండు పార్టీలు రెండో స్థానం కోసం పోటీ పడబోతున్నాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని సెటైర్లు వేశారు.

## ఆపద సమయంలో ధిరోచితంగా వ్యవహరించిన చిన్నోడు

**ఫైర్ యాక్సిండెంట్‌లో**

**50 మందిని కాపాడి ఆపద్భాందవుడు**

**హ్యాట్సాఫ్ అంటూ పలువురి ప్రశంసలు**



రంగారెడ్డి, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): వయస్సుతో సంబంధం లేకుండా ఆపద సమయంలో చాకచక్యంగా వ్యవహారించాడో చిన్నోడు. ఫైర్ యాక్సిండెంట్‌లో చిక్కుకున్న 50మంది కార్మికులను ప్రాణాలకు తెగించి కాపాడి ఆపద్భాందవుడయ్యాడు. హ్యాట్సాఫ్ అంటూ ప్రశంసలు పొందాడు. అసలు కుర్రాడు చేసిన సమయస్ఫూర్తి ఏంటీ? అగ్ని ప్రమాదానికి కారణాలేంటీ?

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని అలెన్ హెర్బల్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమను ఆనుకుని నూతనంగా నిర్మిస్తున్న షెడ్డులో వెల్డింగ్ పనులు జరుగుతుండగా మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాద సమయంలో కంపెనీలో సుమారు 300 మంది కార్మికులు ఉండగా ప్రాణ భయంలో చాలా మంది బయటకు పరుగులు తీశారు. అయితే దట్టమైన పొగ అలుముకోవటంతో ఎటువెళ్లలేక సుమారు 50 మంది వరకు లోపలే చిక్కుకుపోయారు. దీంతో అక్కడ ఆందోళన పరిస్థితి నెలకొంది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే ఉన్న నందిగామకు చెందిన పదవ తరగతి విద్యార్థి సాయిచరణ్ నేనున్నాంటూ ఆపద్భాంధవుడిలా ముందుకు వచ్చాడు. సమయస్ఫూర్తిగా వ్యవహరించాడు. అగ్నిప్రమాదంలో తనకు తెలిసిన వారు ఉన్నారన్న సమాచారం తెలుసుకుని ధైర్యంతో ముందుకెళ్లాడు. భవనంపైకి పరుగు పరుగున ఎక్కి ఫైర్ సిబ్బంది అందించిన తాడు కిటికీకి కట్టాడు. సాయి చరణ్ కట్టిన రోప్ సాయంతో చాలా మంది కార్మికులు కిందకు దిగారు. కార్మికులు సురక్షితంగా ప్రాణాలు కాపాడుకున్నారు. కార్మికుల ప్రాణాలను కాపాడిన సాయి చరణ్ ధైర్యాన్ని మెచ్చుకున్నారు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. వయసులో చిన్నోడైన సాయిచరణ్ సమస్ఫూర్తికి హ్యాట్సాఫ్ చెప్పారు పోలీసులు. రియల్ హీరో అంటూ స్థానికులు అభినందించారు.

అయితే అగ్నిప్రమాదం జరిగిన సమయంలో పొగ తట్టుకోలేక కొంత మంది కార్మికులు బిల్డింగ్ మీది నుంచి కిందికి దూకారు. దీంతో ప్రాణాలతో బయటపడినా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న 5 ఫైర్ ఇంజన్లు, మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాయి. ఫైనల్‌గా మంటలను అదుపులోకి తెచ్చారు ఫైర్ సిబ్బంది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాద ఘటనపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు, అసలు ఈప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

## హరీశ్ రావు రాజీనామా పత్రం ఇవ్వడం ఓ డ్రామా

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్) రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు తన మాటకు కట్టుబడి ఉండాలని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తొలుత రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు ఇప్పుడు రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీలకు ముడిపెడుతున్నాడని ఆ తర్వాత ఆరు గ్యారెంటీలతో పాటు మరికొన్ని హామీలు లింక్ చేస్తారని ఎద్దేవా చేశారు. రాజీనామాపై డొంక తిరుగుడు మాటలు మాట్లాడవద్దని రాజీనామా విషయంలో హరీశ్ రావు రాజీనామా పత్రం ఇవ్వడం ఓ డ్రామా అన్నారు. ఆయన పక్కా డ్రామా మాస్టర్ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ కు కట్టుబడి ఉన్నారన్నారు. శనివారం హన్మకొండలో వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి మీడియాతో మాట్లాడిన శ్రీహరి బీఆర్ఎస్ ఓ ప్రాంతీయ పార్టీ అని విమర్శించారు.

**కేసీఆర్ అధికారులను బలి చేశారు**

కేసిఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారని గత ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలకు ఆయనే సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం బ్యారేజ్ లో పిల్లర్లు కుంగిపోవడానికి కేసీఆరే బాధ్యత వహించాలని, ఫోన్ ట్యాపింగ్ కామన్ అన్న కేసీఆర్ అధికారులను బలి చేశారని ధ్వజమెత్తారు. ఈ కేసులో తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను ఇరికించారని ఆరోపించారు. కేసీఆర్ ప్రమేయం లేకుండానే వాళ్ళు ఫోన్ ట్యాపింగ్ చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేని బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని తహతహలాడుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళ సూత్రానికి భద్రత ఉండదనే విధంగా ప్రధాని మోదీ నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ రిజర్వేషన్లు పరోక్షంగా ఎత్తివేసే కుట్ర చేస్తోందని దీని వల్ల దేశం ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ కుట్రల పట్ల భారత దేశ ప్రజలు మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తమవ్వాలని పిలుపునిచ్చారు.

**మందకృష్ణ నా ఇంటికి వచ్చి దండం పెడతాడు:**

నా బిడ్డ కడియం కావ్య ఎంపీగా గెలిచిన తర్వాత ఇదే మంద కృష్ణ నా ఇంటికివచ్చి దండం పెడతాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. నా వద్ద వందల కోట్లు ఉన్నది నిజమే అయితే నాపై ఐటీ, ఈడీ సోదాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తుంది. మే 13న కాంగ్రెస్ ఓటు వేసి బీజేపీ కి బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణకు బీజేపీ వ్యతిరేకం కాబట్టే విభజన హామీలను అమలు చేయడం లేదని తెలంగాణలో బీజేపీకి ఓటు అడిగే నైతిక అర్హత, హక్కు లేదన్నారు. గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి ఉండి తెలంగాణకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళికను సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 7 నియోజకవర్గల అభివృద్ధి ప్రణాళికను మీ ముందు పెట్టబోతుందని చెప్పారు.

## పదేండ్లలో చేయలేని పనులను 3 నెలల్లో చేయమనడం హాస్యాస్పదం

**మొదటి పేజీ తరువాయి**

హరీశ్ రావు వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. బీజేపీ నిరుద్యోగుల శాతాన్ని పెంచిందని ధ్వజమెత్తారు. శనివారం యాదాద్రి భువనగిరిలో తెలంగాణ జనసమితి జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరామ్ బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శలు గుప్పించారు. నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులకు అప్పులు పెరిగాయని దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సామాన్య ప్రజల జీవితాలు మెరుగుపడాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

## రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు. నాతోపాటు ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది.. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి అని కేసీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# గణితానికే గమ్యం చూపిన శ్రీనివాస రామానుజన్

శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ భారత దేశానికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పరుచుకొని గణితం పట్ల ఆశక్తిని పెంచుకొని త్రికోణమితి మీద రాసిన పుస్తకాలను చదివి పూర్తిగా అవగాహన చేసుకొని, పదమూడు సంవత్సరాలు నిండే సరికల్లా ఆ పుస్తకాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని, సొంతంగా సిద్ధాంతాలు కూడా తయారు చేయడం ప్రారంభించే స్థాయికి ఎదిగిన ప్రజ్ఞావంతుడు రామానుజన్. రామానుజన్ డిసెంబర్ 22, 1887 నాడు తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ పట్టణంలో జన్మించారు. రామానుజన్ తండ్రి కె శ్రీనివాస అయ్యంగార్ ఒక చీరల దుకాణం లో గుమాస్తాగా, తల్లి కోమలటమ్మాళ్ గృహిణిగా ఉండేవారు. వీరు కుంభకోణం పట్టణంలోని ఒక పెంకుటింట్లో నివసించేవారు. 1892 అక్టోబరులో రామానుజన్ ఊళ్ళో ఉన్న చిన్న పాఠశాలలో చదవడం ప్రారంభించాడు. రామానుజన్ తాత కాంచీపురం న్యాయస్థానంలోని ఉద్యోగం కోల్పోవడంతో, రామానుజన్ తల్లితో సహా కుంభకోణం చేరుకుని అక్కడ కంగయాన్ ప్రాథమిక పాఠశాలలో చేరాడు. ఆ తర్వాత మద్రాస్ మారినా చదువు పట్ల శ్రద్ధ కనబరచలేదు. తల్లి నుంచి రామానుజన్ సంస్కృతి సంప్రదాయాల గురించి, ఆచార వ్యవహారాల గురించి, పురాణాల గురించి తెలుసుకుని అనతి కాలంలోనే ఆంగ్లం, తమిళం, భూగోళ శాస్త్రం, గణితంలో పట్టు సంపాదిస్తూ ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. మంచి మార్కుల తో జిల్లాలో అందరికన్నా ప్రథముడిగా నిలిచి 1898లో హయ్యర్ సెకండరీ పాఠశాలలో చేరాడు. ఈ పాఠశాలలోనే మొట్టమొదటి సారిగా గణితశాస్త్రంతో పరిచయం ఏర్పడి కాలక్రమంలో ప్రపంచం మెచ్చే వ్యక్తిని చేసింది. 15 ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్ సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం ఆయనకు తెలియకపోవడం చేత వాటిని తన పద్ధతితో సాధించి చూపారు. 1909, జులై 14వ తేదీన రామానుజన్‌కు జానకీ అమ్మాళ్ అనే తొమ్మిదేళ్ళ బాలికతో వివాహమైంది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చిపడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. అప్పట్లో కొత్తగా ఒక గణిత శాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని కలిసి తనకొక చిన్న ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. తాను తీరిక వేళలో గణితం మీద రాసుకున్న నోటు బుక్కులను చూపించాడు. వాటిని చూసిన అయ్యర్ చాలా ఆశ్చర్యపోయి రామానుజన్ ప్రతిభ చాలా గొప్పదని గుర్తించాడు. తన వద్ద చిరుద్యోగిగా చేరడం బాగుండదని భావించి మద్రాస్‌లో తనకు పరిచయం ఉన్న గణిత శాస్త్రవేత్తల దగ్గరకు తన సిఫారసు లేఖతో పంపించాడు. రామానుజన్ రాసుకున్న పుస్తకాలను చూసిన కొద్ది మందిలో ఒకరైన జిల్లా కలెక్టరుగా పని చేస్తున్న రామచంద్రరావు, భారతీయ గణిత శాస్త్ర సమాజంలోని బృందానికి రామానుజన్ ప్రతిభ అమోఘం అని అర్థమైంది. రామానుజన్ ప్రతిభను గుర్తించిన నారాయణ అయ్యర్, రామచంద్ర రావు, ఇడబ్లు మిడిల్‌మాస్ట్ మొదలైన వారు రామానుజన్ పరిశోధనలను ఆంగ్ల గణిత శాస్త్రవేత్తలకు చూపించడానికి ప్రయత్నించారు. లండన్ యూనివర్శిటీ కాలేజీకి చెందిన ఎంజెఎం హిల్ అనే గణితజ్ఞుడు రామానుజన్ పరిశోధనలను చదివి అందులోని తప్పులను సవరించడానికి తగిన సలహాలు అందించి ప్రోత్సహించాడు. 1913లో మద్రాస్ పోర్ట్ ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ హాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్ హార్డికి పంపారు. ఉన్నత స్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జిహెచ్ హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. రామానుజన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 1919 మార్చిలో ఇంగ్లాండ్ నుండి భారత దేశానికి తిరిగి వచ్చారు. వెళ్ళేటప్పుడు ఎలా ఉన్నాడో అలాకాక పాలిపోయిన ముఖంతో ఏమాత్రం బలం లేని శరీరంతో అస్థిపంజరంవలే తిరిగి రావడం చూసి అక్కడి వారందరూ చలించిపోయారు. అనేక రకాల వైద్యం చేయించినా ఆయన కోలుకోలేకపోయారు. దాంతో ఆయన 1920, ఏప్రిల్ 26న పరమపదించారు. అతి చిన్న వయసులో ప్రపంచం ఆశ్చర్యపోయే మేధా సంపత్తిని కలిగిన ఒక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడిని కోల్పోవలసి వచ్చింది. ఫిబ్రవరి 28, 1918లో ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండవ భారతీయునిగా, 1918 అక్టోబరులో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజీ' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా రామానుజన్ చరిత్రకెక్కారు.

# మండలంలో బిఆర్ఎస్ కు భారీ షాక్

**భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు**

**అహంకారం మార్పు కొరకే పార్టీలో చేరిక: గుగులోత్ హరి**

రఘునాథపాలెం, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల సమయంలో భారీగా ఎదురు దెబ్బ ఎదురు అవ్వడం జరిగింది. మండలంలోని పరికెలబోడు తండా గ్రామం నుంచి బిఆర్ఎస్ పార్టీలో నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు నాయకులు చేరడం జరిగింది. శనివారం ఎస్ఆర్ గార్డెన్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు దుర్గాప్రసాదరావు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు మండలం పార్టీ ఇంచార్జ్ మలీదు జగన్ సమక్షంలో జిల్లా నాయకులు ధరావత్ రామ్మూర్తి ఆధ్వర్యంలో పరికరబోడు తండా గ్రామం నుండి 6వ వార్డు మెంబర్ గుగులోత్





హరి, 8వ వార్డు మెంబర్ బాణోత్ భద్రు వారి వెనకాల కొన్ని 40 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. అనంతరం వార్డు మెంబర్ గుగులోత్ హరి, బానోత్ బద్రు మాట్లాడుతూ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో అధికార పెత్తనం ఎక్కువై అవినీతి అక్రమాలకు దారి తీయడం జరిగింది. గ్రామ అభివృద్ధికి నోచుకొని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఏ గ్రామాలు చూసినా అభివృద్ధి దిశగా కనిపించిన పరికెలబోడు తండా గ్రామం మాత్రం ఏ అభివృద్ధికి ఏ సంక్షేమ పథకాలకి నోచుకోని పరిస్థితి ఏర్పడింది. అధికార అహంకారంతో గ్రామంలో పలువురు నాయకులు వాళ్ళ ఇష్టానుసారంగా వ్యవహరించడమే దేనికి కారణం అయింది. ప్రతి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల ప్రణాళిక, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం మరియు గ్రామంలో అనేక కుటుంబాలు ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేక అనేక కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్న సందర్భంలో ఈ పదేళ్ల కాలంలో ఆ గ్రామానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా రాకపోవడమే దీనికి ముఖ్య కారణం ఇదే కాకుండా మరెన్నో సంక్షేమ పథకాలు వంటి మొదలగు కార్యక్రమాలను అమలవకపోవడం అలాంటి ఏ కార్యక్రమాలు జరగలేదు, ఏ పథకాలు అమలులో కాలేదు, దీనికి కారణం గ్రామంలో రాజకీయ నాయకుల అధికార అహంకారమే ఎక్కువ అవ్వడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవడం జరిగింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎవరితో చెప్పుకోవాలో ఎవరి చెంతకు వెళ్లి పరిష్కరించుకోవాలో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడడంతో గ్రామంలో అనేక సమస్యలు ఏర్పాటు జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మెచ్చుకొని ప్రభుత్వం అధికారంలో రాగానే ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది. అదే దిశగా కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే మా గ్రామానికి తగిన న్యాయం జరిగి అభివృద్ధి వైపు తీసుకెళ్లవచ్చు అనే ఉద్దేశంతోనే బిఆర్ఎస్ పార్టీని వీడి ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.

దేశంలో ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రతి గ్రామాలు అభివృద్ధి దిశగా నడవాలి అంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావాలి కాబట్టి ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటరీ ఎన్నికలలో ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా రామ సహాయం రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్ కి పంపించాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. కేంద్రంలో మరొకసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బహుజన కులాలకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవడం తథ్యం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. కావున ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ వంతు కృషి, పట్టుదలతో పనిచేసి ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించవలసిందిగా కొనియాడారు. వీరితోపాటు బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ధరావత్ భీమ్లా నాయక్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ యువజన నాయకుడు భూక్యా రమేష్ నాయక్, గ్రామ నాయకులు మరియు యువకులు తేజావత్ బాలకృష్ణ, భూక్యా నరేందర్, బానోత్ పాండు రాజ్, ధరావత్ అనిల్, భూక్యా శంకర్, ధరావత్ రవి, బానోత్ అఖిల్ తదితరులు పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ధరావత్ సుధాకర్, బానోత్ నరేష్, బానోత్ రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ప్లాట్ కబ్జా

- **పల్కుబడి అండతో హల్‌చల్**
- **బలిదుపల్లి ప్లాట్లు అక్రమంగా స్వాధీనం!**
- **బెదిరింపులకు గురి చేస్తున్నారు బాధితుడు వెంకటేష్**
- **స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**
- **తమ ప్లాట్ కాపాడాలంటూ బాధితుడి ఆవేదన**





దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): బలవంతంగా ప్లాట్లను ఖాళీ చేయాలని, వెంటనే వెళ్లిపోవాలంటూ అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదనతో బాధితుడు వెంకటేష్ చెప్పారు. ఈ ప్లాట్లు తమవని, ఎందుకు వెళ్లాలని అన్నందుకు గుడిసె, గోడలను కూల్చివేస్తూ దిక్కున్నచోట చెప్పుకోమని అంటున్నారని పేర్కొన్నారు. వెంటనే ఖాళీ చేయకపోతే చంపుతామని కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా మా ప్లాట్ లో జెసిబి తో చదును చేస్తుండాని అడ్డాకుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు. పూర్తి వివరాలు మహబూబ్ నగర్ జిల్లా, అడ్డాకుల మండలం, బలిదుపల్లి గ్రామానికి చెందిన సత్యరెడ్డి దగ్గర 1982 సంవత్సరంలో ఎరుకల గంగన్న(ఎస్టీ)రెండు గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆ స్థలంలోనే 20 సంవత్సరాలుగా గుడిసె నిర్మించుకొని పందుల దొడ్డి ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో జీవించే వాళ్ళం కాలక్రమేనంగా గుడిసె కూలిపోవడంతో అదే గ్రామంలో వేరే స్థలంలో ఇల్లు నిర్మించుకుని ఉన్నాం. కానీ ఆ స్థలంలో పందుల దొడ్డి నిర్మించుకున్నాం ఇప్పుడు సత్యారెడ్డి నా భూమి అంటూ జేసిబీ తో అక్రమంగా ప్లాట్ లో ఉన్న రాళ్ళ, కంపను తొలగిస్తున్నారని న్యాయం చేయాలని అంటూ అడ్డాకుల పోలీస్ స్టేషన్లో గంగన్న కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అడ్డాకుల తహసిల్దార్ కార్యాలయంలో 27-12-2023 జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 01-04-2024న ఫిర్యాదు చేశామని వెంకటేష్ తెలిపారు. ఈ స్థలాన్ని గ్రామ కంఠంలో కలిపి రైతుబంధు నిలిపివేయాలని ఫిర్యాదు చేశాము. మా ప్లాట్ లో జెసిబి తో చెట్లను రాళ్లను తొలగిస్తున్నాడని అడ్డాకుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపడతామని అడ్డాకుల ఎస్సై అన్నారని ఫిర్యాదారుడు వెంకటేష్ తెలిపారు.

# నందిమల్లలో ప్రారంభమైన బండలాగు పోటీలు



ఆత్మకూరు, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): అమరచింత మండలం నందిమల్ల గ్రామంలో శ్రీ శ్రీ చింతల ముని రంగస్వామి జాతర సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభ రాజముల రెండు ఎదుల బండ్ల గిరక బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ కేశం నాగరాజ్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ చింతల మునిరంగస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరచిత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరుణ్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, నందిమల్ల గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి బలం ఎంత పోటీపడి బహుమతి గెలుచు



**– పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత**

ఆత్మకూర్, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల పరిధిలోని నందిమల్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ చింతలం ముని రంగస్వామి జాతర సందర్భంగా సంద రాళ్ళు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతల మునిరంగ స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంద రాళ్ల పోటీలో గెలుపొందిన మొదటి రెండవ మూడవ బహుమతులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆయుబ్ ఖాన్, అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేజీ మహేందర్రెడ్డి, ఆత్మకూరు నాగేశ్వర్, నందిమల గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి వర్కర్స్ జీతాలు వెంటనే విడుదల చేయాలి

**– సిపిఐ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**



నేరేడుచర్ల, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): గత రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, ఆయాల జీతాలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం నాడు ఆయన నేరేడుచర్లలోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, పసిపిల్లలకు ప్రభుత్వం నుంచి వచ్చే పోషకాహారం అందించడమే కాకుండా ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులను ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల బాగోగులను చూస్తూ వారి ఆలనా పాలనలో ఆటపాటలలో ప్రధాన పాత్ర వహిస్తున్న అంగన్వాడీలకు గత రెండు నెలల కాలంగా జీతాలు రాకపోవడం బాధాకరమని తక్షణమే ప్రభుత్వ స్పందించి వారి జీతాలు విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమ జీతాలు పెంచాలని అంగన్వాడీలు సమ్మెబాట పట్టారని అయినప్పటికీ ఆనాటి ప్రభుత్వం స్పందించలేదని కానీ నేడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపై అంగన్వాడీలు ఆయాలు హెల్పర్లు అనేక ఆశలు పెట్టుకొని ఉన్నారని, ఇప్పటికైనా తమ వేతనాలు పెరుగుతాయని ఆశిస్తే వేతనాలు పెరగకపోగా ఉన్న జీతం కూడా రాక రెండు నెలలు దాటిందని, తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ ఔట్సోర్సింగ్ వ్యవస్థ రద్దు పరచి అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక నిత్య జీవిత అవసర వస్తువుల ధరలుమూడు రెట్లు పెరిగాయని పెరిగిన జీవిత అవసరాలకు తగు విధంగా జీతాలు సవరించాలని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అంగన్వాడీలకు, ఆశా వర్కర్లకు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల మొదటి తారీకునే జీతాలు చెల్లించాలని, జీతాలతో పాటు గత 4 నెలలుగా పెండింగులో ఉన్న గ్యాస్ బిల్లులు, టిఏ లు కూడా చెల్లించాలని ఇప్పటికే అంగన్వాడీల బతుకులు దుర్భరంగా మారాయని రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు మంత్రులు, లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్నారని అంగన్వాడీలకు జీతాలు ఇచ్చేందుకు నిధులు సరిపోవటం లేదా అని ఆయన ప్రశ్నించారు.

# బిజెపి అభ్యర్థి డీకే అరుణమ్మను అత్యధిక మెజార్టీ గెలిపించాలి

**– బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**

ఆత్మకూరు, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): నర్వ మండల కేంద్రంలో శనివారం రోజు నర్వ బిజెపి మండల ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మహబూబ్నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గద్వాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగాళా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ మాసంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన నన్ను పక్కనపెట్టి నన్ను సంప్రదించకుండా నా ప్రమేయం లేకుండా తిలందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. జలంధర్



రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నందున నేను నా అనుచరులతో కలిసి బిజెపి పార్టీలో చేరామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆల్విన్ హెర్బల్‌లో మళ్లీ వ్యాపిస్తున్న మంటలు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నందిగామలోని ఆల్విన్ హెర్బల్ పరిశ్రమలో మళ్లీ మంటలు వ్యాపిస్తున్నాయి. పరిశ్రమలో మరోసారి భారీ శబ్ధాలతో రసాయన డ్రమ్ములు పేలాయి.

దీంతో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతంలో పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేస్తున్నారు. శనివారం సాయంత్రం హెర్బల్ కంపెనీలో వెల్డింగ్ పనులు చేస్తుండగా మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. మంటల ధాటికి ఏసీలు ఒక్కసారిగా పేలడంతో మంటల తీవ్రత పెరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో దాదాపు 50 మంది కార్మికులు ఉన్నారు. దీంతో భయాందోళనకు గురైన

# భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలి

**- వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలి**

**- భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్**



గరిడేపల్లి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సిఐటియు అనుబంధ సంఘం కార్మిక సోదరులందరూ మేడే కార్యక్రమాన్ని ఘనంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేయకుండా నిర్వహించాలని, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ కార్మికులను కోరారు. గరిడేపల్లి పట్టణ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అధ్యక్షతనలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సోమయ్య గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉందని కార్మికులు పనిచేయు సమయంలో తలపాగాలు చుట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని శీతల పానీయాలు అధికంగా సేవించాలని శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు నూతన సంక్షేమ పథకాలు అందించాలని వెల్ఫేర్ బోర్డు నిధులు వందల కోట్లు ఉన్న కార్మికులకు ఖర్చు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ సత్తార్, ఆ సంఘం నాయకులు గుంజ రవీందర్, సైదా హుస్సేన్, పటాన్ కరిముల్లా, శివ, సారయ్య, గురవయ్య, నారాయణ, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకు కృషి చెయ్యాలి

**- యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నర్సింహ**



యాచారం, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నర్సింహ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం రోజు వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులకు ప్రచార సామాగ్రి అందచేసి అన్ని గ్రామాలలో గడప గడపకు వెళ్లి ప్రచారం చేయవలసిందిగా కోరారు.

ఈ సందర్భంగా మస్కు నర్సింహ మాట్లాడుతు పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు చేసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేసి చామల కిరణ్ కుమార్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్ ను విమర్శించే స్థాయి జగదీష్ రెడ్డికి లేదు

**- కాంగ్రెస్ జిల్లా నాయకులు కునూరు సాయి కుమార్ గౌడ్**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధనలో తన మంత్రి పదవిని సైతం వదులుకొని నిరాహార దీక్ష చేపట్టిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డినీ విమర్శించే స్థాయి జగదీష్ రెడ్డికి లేవని కాంగ్రెస్ జిల్లా నాయకులు కునూరు సాయి కుమార్ గౌడ్ అన్నారు. పది సంవత్సరాలు మంత్రిగా ఉండి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క సీటు కూడా గెలిపించుకోలేని అసమర్థ మంత్రి జగదీష్ రెడ్డి అని అన్నారు. కెసిఆర్ దగ్గర నీవు ఏమి చేసేవాడివో మీ సొంత పార్టీ వాళ్లే చెబుతున్నారు. 10 సంవత్సరాలు మంత్రిగా ఉండి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నీవల్ల ఒరిగిందేమీ లేదని నీవల్లనే చాలామంది ఓడిపోయామని మీ పార్టీ తాజా మాజీ ఎమ్మెల్యే లంతా బాహాటంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ మంత్రిగా యాదాద్రి పవర్ ప్లాంట్ లో జరిగిన అవినీతిపై అతి త్వరలో జైలుకు వెళ్ళబోవాల్సి వస్తుందని జగదీష్ రెడ్డి కోమటిరెడ్డి బ్రదర్స్ పై రాద్దాంతం చేస్తున్నారు. మానవత్వానికి మంచి పేరు అయినా మా కోమటిరెడ్డి బ్రదర్స్ పై మరోసారి మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలమంతా నీకు సరైన బుద్ధి చెబుతామని ఇదే నీకు చివరి హెచ్చరిక అని అన్నారు.

# ఫంక్షన్ వర్టికల్స్ పకడ్బందీగా అమలు చేయాలి

**- జిల్లా వర్టికల్ ఇంచార్జ్ అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా ఎస్పీ రక్షిత కె. మూర్తి ఐపీఎస్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పి రక్షిత కె. మూర్తి ఐపీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ 14 వర్టికల్స్ గురించి ఒక్క ఒక్క వర్టికల్ ఇన్చార్జిలతో నెల వారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో రిసెప్షన్, స్టేషన్ రైటర్, బ్లూ కోర్ట్ పెట్రో కార్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, టేక్ టీం, 5'%o%, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్, స్టేషన్ ఇంచార్జ్, ఎస్హెచ్వో %డ% ఐఓ వారెంట్స్ %డ% సమన్స్, మరియు సైబర్ క్రైమ్స్ ఈ 14 వర్టికల్స్ ను సమర్థవంతంగా అమలుపరచాలని జిల్లా ఎస్పీ ఆదేశించినారు. రిసెప్షన్ వర్టికల్ గురించి ఎస్పీ వివరిస్తూ పోలీస్ స్టేషన్ కు వివిధ రకాల అభ్యర్థనలు/ ఫిర్యాదులు/ సమాచారం/ సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, తగు సేవలు అందించడంలో రిసెప్షన్ అధికారి యొక్క పాత్ర కీలకమైనదని, ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కల్పించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్య పాత్ర వహిస్తారని తెలిపారు. రిసెప్షన్ అధికారి బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి పట్ల స్నేహపూర్వకంగా వ్యవహారి ప్రజలకు పోలీసులపై నమ్మకం ఏర్పడే విధంగా చేయాలి అని తెలిపారు. ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచాలని అన్నారు. కేసుల చేదనలో ఆత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి. అలాగే ఎన్ బి డబ్ల్యు ఎస్ వారంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలి. నేరచేదనకు ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాలు అవశ్యకత పై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని ఎక్కువ మొత్తంలో సీసీ కెమెరాలు స్థాపించుటకు కృషి చేయాలని తెలియజేశారు. ప్రజలకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సైబర్ క్రైమ్ కు సంబందించి ఆన్లైన్ లో పిర్యాదులు వస్తే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జరగబోయే ఎలక్షన్ లను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటి నుండే ఎస్హెచ్వో లు వారి మండలాల్లో తరుచుగా వెళ్లి, ప్రజలతో మరియు యువకులతో సత్సంబంధాలు ఏర్పరుచుకొని ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి, గ్రామాలలో తిరిగే కొత్త వ్యక్తుల గురించి ఆరా తీయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, వనపర్తి డి.ఎస్పి జె.వెంకటేశ్వర రావు, వనపర్తి జిల్లా వర్టికల్ ఇంచార్జ్ డిఎస్పి కృష్ణ కిషోర్, వనపర్తి సీఐ నాగభూషణం, కొత్తకోట సీఐ శ్రీరాం బాబు, సిసిఎస్ సిఐ రవి పాల్, డిసిఆర్బి ఏఎస్ఐ భాష, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# తిప్పాయపల్లిలో నూతన వధూవరులు ఆశీర్వదించిన ఎమ్మెల్యే



వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం, తిప్పాయపల్లి గ్రామంలో శనివారం తన వ్యక్తిగత భద్రత అధికారి రామకృష్ణ చెల్లెలి వివాహం సందర్భంగా చేపట్టిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన ఫోటోలు దిగి కాసేపు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్ జయసుధ మధు గౌడ్, వెంకటేష్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, నాయకులు రంగాపురం రామచంద్రారెడ్డి, గ్రామ నాయకుడు కొండారెడ్డి, చీర్ల శేఖర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి**

**ఓటు హక్కు వినియోగించుకొని యువతకు ప్రేరణగా నిలవాలి**



ములుగు, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులు వయోవృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం లో పార్లమెంట్ లోక్ సభ ఎన్నికలు 2024 స్వీప్ కార్యక్రమములో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి అవగాహన కార్ర్యమము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనునది ఓటు హక్కు ద్వారా మాత్రమే సాధ్యమని, ఓటు హక్కు మన ప్రాథమిక బాధ్యత మరియు విధి అని రానున్న ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలి అంటే ఓటు వేయడం అత్యంత ముఖ్యమని, ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడే ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యం అంటారని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో మన దేశం ఒకటని, ఓటును వినియోగించు కోవడం ద్వారానే ప్రజా ప్రభుత్వంలో ప్రజలు భాగస్వాములు అవుతారని, 100% పోలింగ్ జరిగినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యంగా పేర్కొనడం జరుగుతుందని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా పిడబ్ల్యుడి ఓటర్లు మహిళలకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, 85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, పోలింగ్ స్టేషన్ వరకు వెళ్లలేని దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకునే వీలు హెూం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. జిల్లాలో 12 డి ద్వారా దరఖాస్తు చేసు కున్న ఓటరు తప్పక ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృ ద్ధులు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుని తద్వారా మిగతా ఓటర్లకు ఆదర్శంగా నిలవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ప్రతి పోలింగ్ సెంటర్ వద్ద వయోవృద్ధులు, వికలాంగుల కోసం తాము అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి డ బ్లూ డి ఎస్ నోడల్ అధికారిని, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణ లత లెనినా, స్వీప్ నోడల్ అధికారి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్, సిడి పి ఓ మల్లీశ్వరి, స్వాతి, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు,తదితరులు పాల్గొన్నారు.

# బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): శ్రీ శ్రీ శ్రీ కోదండ రామస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభరాజ బండలాగుడు పోటీలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సందర్భాల్లో ఉత్సవాల సందర్భాల్లో గ్రామాల్లో నిర్వహించే బండలాగుడు పోటీల కార్యక్రమంతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంటుందని, బండలాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణగానిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణులకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్పేట్ కాంగ్రెస్ నాయకులు సత్య శీలా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు మంగదొడ్డి నాగే శేషు యాదవ్, యూత్ అధ్యక్షుడు ఎండి బాలపీరు, మాజీ ఎంపిటిసి మేస్త్రి బాలయ్య, కోదండం, వార్డు నెంబర్ వెంకటయ్య, బుచ్చన్న నాయక్, మెకానిక్ శంకర్, మేస్త్రి శివ, కొంకలి కృష్ణయ్య, ధన్వాడ నాగరాజు, పార్థసారథి, ఉప్పరి యాదగిరి, తెలుగు బాలయ్య, శివాలు, కిషోర్, శివుడు, వెంకటేష్, అనంత రాములు, వెంకట్ రెడ్డి, మల్లేష్, వెంకటేష్, రవి, శంకరయ్య, కోదండం, చరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణకి ఘన సన్మానం



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): భువనగిరి పట్టణ కేంద్రంలో శనివారం నాడు విశ్వకర్మ జర్నలిస్టు సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జర్నలిస్టు పి లక్ష్మీనారాయణ మరియు జిల్లా ఉపాధ్యక్షులు కూరెళ్ళ మల్లేష్ కీ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ శానూర్ బాబా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వకర్మ జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేయాలని ప్రభుత్వ నుండి రావాల్సిన పథకాల ద్వారా స్కీముల ద్వారా విశ్వకర్మ జర్నలిస్టులకు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. విశ్వకర్మ జర్నలిస్టులకు తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపరాజు వెంకన్న, సీనియర్ జర్నలిస్టు దాత్రాక్ దయాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టిగప్పుల శ్రీనివాస్ టీజేయూ సభ్యులు గడ్డమీ సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

# యువత సన్మార్గంలో నడవాలి

**- ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు నేరేడుచర్ల ఎస్సై రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో ఆహ్వాన సదస్సు**

నేరేడుచర్ల, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ ఆదేశాల మేరకు నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ దర్శించర్ల గ్రామంలో పోలీసు కళాభృందం అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల, విద్యార్థుల రక్షణ, చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం లాంటి అంశాలపై మరియు విద్యార్థులు ఒత్తిడి అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలి, లక్ష్యం కోసం కృషి చేయాలని పోలీస్ కళాబృందం సభ్యులు పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ అధ్వర్యంలో మహిళల రక్షణపై పటిష్టంగా పని చేస్తున్నామని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలి చట్టాలను చేతుల్లోకి తీసుకోకుండా వాటిని గౌరవించి పోలీస్ వారికి తెలియపరచాలి. ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సోషల్ మీడియాలో ఎవరినైనా ఉద్దేశించి అభ్యంతరకరమైన పోస్టులు పెట్టరాదు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఏటిఎం కార్డ్ వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావద్దు, యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అని తెలిపినారు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. పోలీసు కళబృందం వారు సాంస్కృతిక, జానపద కార్యక్రమాలతో సామాజిక అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెూంగార్డ్ వెంకన్న, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపి, క్రిష్ణ, చారి, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జిల్లా పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీఆవిర్భావ దినోత్సవం

**– నేరేడుచర్ల, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు**
**– అరి బండి సురేష్ బాబు, కృష్ణా నాయక్**



నేరేడుచర్ల, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్, నేరేడుచర్ల మండల పార్టీ అధ్యక్షులు ఆరిబండి సురేష్ బాబు, తో కలిసి పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి గ్రామాలలో కార్యకర్తలు నిర్వహించి పార్టీ బలోపితానికి కృషి చేస్తున్నారని రానున్న లోక్ సభ ఎన్నికల్లో కంచర్ల కృష్ణారెడ్డి విజయమే ధ్యేయంగా కార్యకర్తలు నాయకులు పనిచేస్తున్నారని వారు అన్నారు బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ నాయకత్వంలో అనేక రకాల రైతులు ఇతర పనులపై ఆధారపడుతున్న వారందరూ లబ్ధి చేకూరాలని బిఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలను ఈరోజు గుర్తు చేసుకుంటూ వారు భావిద్యోగానికి గురవుతున్నారని రానున్న లోక్సభ ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ సలహాదారులు గుత్తికొండ వెంకటరమణారెడ్డి, సర్వారం సహకార సంఘం చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ పసుపులేటి రాజేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమాజ హితం కోసం చదవాలి

**– ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**
**– నల్లకుంట నానో కాలేజీలో ఈఏపీసీఈటీ మోడల్ పేపర్ ఆవిష్కరణ**



ముషీరాబాద్: విద్యార్థులు సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేయాలని, ప్యాకేజీల కోసం కాకుండా సమాజ హితం కోసం చదవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని నానో కాలేజీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం EAPCET & NEET ప్రశ్న పత్రాల మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. నానో కాలేజ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ హాజరై EAPCET & NEET మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చుక్కారామయ్య సారథ్యంలో 20 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఎంసెట్ మోడల్ పేపర్, నీట్ వచ్చినప్పటి నుంచి ఆ మోడల్ పరీక్ష పేపర్‌ను కూడా పెడుతోం దని తెలిపారు. విద్యార్థుల్లో భయం పోగొట్టడానికి, అనుభవం రావడానికి ఈ మోడల్ పరీక్షలు నిర్వహించడం మంచి కార్యక్రమం అని అభినందించారు. ప్రతి విద్యార్థీ మంచి ర్యాంకు రావాలని, ఉన్నత కళాశాలలో సీటు సంపా దించాలని పోటీపడి పరిగెత్తుతారని తెలిపారు. ఎక్కడ సీటు వచ్చిందన్నది ముఖ్యం కాదని, మనం చదివే ప్రతి విషయంలోనూ సమాజంలో జరిగే మంచీ చెడులపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విషయాన్నీ విశ్లేషించడం.. దాన్ని అర్థం చేసుకోవడంతో కొత్త విషయా లను నేర్చుకోవచ్చున్నారు. బట్టీ చదువులు మానుకోవాలని చెప్పారు. ఉత్పత్తులు, వాటి వాడకం, సమాజంలో వాటికున్న లింకులపై ప్రత్యేకంగా చదవాలని, అవి తెలుసుకున్నప్పుడు దేనినైనా సాధించగలరని సూచించారు. కన్న కలలను సాకారం చేసుకోవడానికి శ్రద్ధ పెట్టాలన్నారు. డబ్బుల కోసం కాకుండా సమాజ హితం, అభివృద్ధి కోసం పని చేసినప్పుడే విద్యార్థులు లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు.నానో కాలేజ్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ పోరా టాల్లోనే కాదు విద్యార్థులను చైతన్యవంతులను చేయడంలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యద ర్శులు ఆర్ ఎల్ మూర్తి, నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర్ల కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, నాయకులు విగేష్, ప్రశాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చు

**– శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి**





చిట్యాల, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని, ఆ లక్ష్యంతో ముందుకు వెళితే విజయం వరిస్తుందని శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి, సేవా సమితి ఫౌండర్ పూరి చంద్రకళ అన్నారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సానియా ఇంటర్ ఒకేషనల్ పరీక్షల్లో 1000/960 మార్కులతో జిల్లా ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన సానియా కష్టపడి చదువుకొని ర్యాంకు సాధించడం హర్షనీయమని చెప్పారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. పేద విద్యార్థులకు భవిష్యత్తులో శ్రీ వాసవి సేవా సమితి ద్వారా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

# ఆహారోత్పత్తుల పేరుతో తప్పుడు ఔషధాల తయారీ

**– డీసీఏ దాడుల్లో వెల్లడి**



హైదరాబాద్: ఆహారోత్పత్తుల పేరుతో తప్పుడు ఔషధాలను తయారు చేసి అమ్ముతున్న తయారీ దారులపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు దాడులు నిర్వహించారు. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలోని ఎమినెంట్ రెమిడీస్, కెన్ క్యూర్ ఫార్మాస్యూటికల్స్ లో చట్టవిరుద్ధంగా వీటిని తయారు చేస్తున్నట్టు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా మూత్రపిండాల్లో రాళ్లను కరిగించే ఔషధమంటూ తప్పు దారి పట్టిస్తూ అమ్ముతున్న పథార్ చటడీ (స్టోన్ క్రాకర్) ఆయుర్వేద ఔషధాన్ని అదే జిల్లా కేపీహెచ్ బీలోని ఒక మెడికల్ షాప్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీన్ని రాజస్థాన్ కు చెందిన రాజ్ పుటానా అగ్రికో తయారు చేస్తున్నది.

నకిలీ క్లినిక్ లపై దాడులు

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామంలో వైద్యం చేసేందుకు అవసరమైన అర్హత లేని జి. శ్రీనివాసులు నడుపుతున్న శ్రీరాం ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పై దాడి చేసి 28 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా హైదరాబాద్ జిల్లా ముషీరాబాద్, గాంధీనగర్ , పద్మశాలీ కాలనీలో యునానీ మెడికల్ ప్రాక్టీషనర్ డాక్టర్ అహ్మద్ షాహిద్ వారీస్ వద్ద నిల్వ ఉన్న అల్లోపతిక్ ఔషధాలను గుర్తించారు.
అతడి వద్దనున్న 21 రకాల ఔషధాలను సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ అమ్మడం, అర్హత లేకుండా వైద్యునిగా ప్రాక్టీస్ చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికలకు రంగం సిద్ధం!!

**– పూర్తిస్థాయిలో అధికారుల సన్నద్ధం!!**

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికల్లో ప్రారంభమైన నేపథ్యంలో దశలవారీగా జరుగుతున్న ఈ ఎన్నికలు జరుగుతున్నాయి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వచ్చేనెల 13న పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి, ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఎవరివశం అవుతుందో రాబోయే కొన్ని రోజుల్లో తేటతెల్లమవుతుంది పార్లమెంట్ భవనాన్ని శాసించి భారత ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఒకపక్క భారతీయ జనతా పార్టీ, మరో పక్క కాంగ్రెస్ పార్టీ నువ్వా నేనా అనే రీతిలో పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం భారత ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ చేతిలో గత పది సంవత్సరాల కాలం నుంచి కొనసాగుతుంది, దేశ భవిష్యత్తును మార్చే ఈ ఎన్నికలు 2024 నుంచి భారత ప్రభుత్వంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది ఈ ఎన్నికలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే కేంద్ర బలగాలు సాయుధ మిలిటరీ బలగాలు తెలంగాణ రాష్ట్రానికి చేరుకున్నాయి. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మొత్తం 4,004 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి, మహబూబ్నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలు జడ్చర్ల నియోజకవర్గంలో 274, దేవరకద్ర నియోజకవర్గంలో 289 నారాయణపేట నియోజకవర్గం లో 270 మక్తల్ నియోజకవర్గంలో 284, కొడంగల్ నియోజకవర్గంలో 282, షాద్నగర్ నియోజకవర్గం లో 263, నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 339, కల్వకుర్తి నియోజకవర్గంలో 271 గద్వాల నియోజకవర్గంలో 303, అల్లంపూర్ నియోజకవర్గంలో 291 కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 292, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 307 నియోజకవర్గాల చొప్పున మొత్తం 4,004 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో తీవ్రమైన ఎండల మధ్య జరుగుతున్న సందర్భంలో ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందా తగ్గుతుందా అనే ఉత్కంఠ కూడా నెలకొన్నది ఇప్పటికే ఎండలు 45 డిగ్రీల ఉష్ణోగ్రత మార్కు దాటడంతో వచ్చే నెల మే 13 తారీకు నాటికి మరో మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగి మొత్తం 48 డిగ్రీల వరకు చేరుకునే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. ఎండల దృష్ట్యా పోలింగ్ శాతం తగ్గకుండా పెరిగే విధంగా అధికారులు ఓటర్ల కోసం షామినాలు, వాటర్ బాటిల్స్, మజ్జిగ నిమ్మరసం తో పాటు నిలువ నీడ కల్పించాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లు ను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా స్వచ్ఛందంగా తరలించే విధంగా కృషి చేయాలని ఎన్నికల అధికారులు కోరారు. ముఖ్యంగా వృద్ధుల కోసం ప్రత్యేక వాహనాల ద్వారా తరలించాలని వికలాంగులు వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సుర్రుమంటున్న సూరీడు

**– గడప దాటాలన్నా భయం..భయం..**
**– సాయంత్రం వరకూ వేడి గాలులు**
**– మండిపోతున్న తెలంగాణం**
**– జమ్మికుంటలో 45.6 డిగ్రీలు**
**– ఈ ఏడాది ఇదే అత్యధికొం చాలా జిల్లాల్లో 44 డిగ్రీలకుపైనే నమోదు**



హైదరాబాద్: తెలంగాణం మండిపోతున్నది. ఎన్నికల వేడి కంటే భానుడి ఎండ తీవ్రతే ఎక్కువగా కలవరపెడుతున్నది. శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యధికంగా 45.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇదే అత్యధికం. చాలా జిల్లాల్లో పగటిపూట 44 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 24 డిగ్రీల నుంచి 28 డిగ్రీల వరకు నమోదవుతుండటం గమనార్హం. ఏప్రిల్ చివరి వారంలోనే ఈ తరహాల్లో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. ఉక్కపోత తీవ్రంగా ఉంది. దీనికి తోడు సాయంత్రం ఆరేడు గంటల దాకా వేడిగాడ్పులు వీస్తూనే ఉన్నాయి. దీంతో ప్రజలు సాయంత్రం వరకు ఇంట్లో నుంచి బయటకు రావాలం టేనే జంకుతున్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఉష్ణతాపానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందనివాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తు న్నారు. వచ్చే ఐదు రోజులు కూడా రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశమున్నదనీ, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. శనివారం రాష్ట్రంలోని మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, హన్మకొండ, రంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో పలుచోట్ల వడగాడ్పులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో రాష్ట్రంలో ఒకటెండ్రు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది.

# అంగన్వాడీ కేంద్రాలను ప్రక్షాళన చేయాలి

**– బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేష్**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ప్రక్షాళన చేసి, విద్యార్థులకు, గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన ఆహారం అందించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజాపేట మండలం, చల్లూరు గ్రామంలో శనివారం గర్భిణీ కి అందించిన ఆహారంలో ఈగలు పడి చనిపోయి ఉండడం, అంగన్వాడీ కార్యకర్తల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గత నెలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కేమెరాలు ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తలకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని సూచించారని వెంకటేష్ గుర్తు చేశారు. అధికారులు వెంటనే ముఖ్యమంత్రి సూచనలు అమలు చేసి, పసి పిల్లలకు, తల్లులకు, గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎస్ఎస్ఏలో ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగుల టెర్మినేషన్

**– ఎన్నికల విధుల్లో పాల్గొనాలని ఆదేశాలు**



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. సమగ్ర శిక్షలో పాఠశాల స్థాయిలో పనిచేస్తున్న సుమారు 2300 మంది ఒప్పంద ఉపాధ్యాయులను ఈనెల 23 పాఠశాల చివరి పని దినం రోజున విధుల నుంచి తొలగిస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరికి ఎన్నికల్లో డ్యూటీ చేయాలని తిరిగి జీవో జారీ చేయడం విడ్డూరంగా ఉందని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ స్ట్రగుల్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పంద ఉద్యోగులకు పూర్తిస్థాయిలో 12 నెలలకు నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మాత్రం కేవలం 10 నెలల వేతనాలు ఇచ్చి రెండు నెలల వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగంలో నుంచి టర్మినేషన్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవీందర్ రాజు మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలని, లేకుంటే ఎన్నికల విధులకు హాజరు కామని తేల్చిచెప్పారు. జిల్లా నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగంలో నుంచి టర్మినేషన్ చేసి ఎన్నికల విధులకు హాజరుకావాలని ఉత్తర్వులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 12 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల టర్మినేషన్‌ను ఎత్తివేసి రీ ఎంగేజ్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని, లేని పక్షంలో ఎన్నికల విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

# కౌశిక్ రెడ్డి తస్మాత్ జాగ్రత్త...

## నోరు అదుపులో పెట్టుకో

**– కోమటిరెడ్డి విమర్శించే స్థాయా నీది**
**– కాంగ్రెస్ యూత్ నాయకులు నోముల విష్ణు**



రామన్నపేట, ఏప్రిల్ 27(తీన్మార్ న్యూస్): పాడి కౌశిక్ రెడ్డి తస్మాత్ జాగ్రత్త జర నోరు అదుపులో పెట్టుకో కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి నీది కాదని నకిరేకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు నోముల విష్ణు హెచ్చరించారు. తెలంగాణ ఇవ్వకపోతే మంత్రి పదవికి సైతం రాజీనామా చేసిన నాయకుడిని పట్టుకొని ఏం మాట్లాడుతున్నావ్ నీకు మతిస్థిమితం లేకుండా ఎన్నికల ముందు ఏం మాట్లాడినావో గుర్తుందా గెలిస్తే విజయాత్ర, లేకపోతే శివయాత్ర అని బ్లాక్ మెయిల్ చేసి ఓట్లు దన్నుకున్నావు. కన్నతల్లి పాలు తాగి తల్లి రొమ్ములు గుద్దే నువ్వు కోమటిరెడ్డి గురించి మాట్లాడే అర్హత నీకు లేదన్నారు. మీ దొరకి నువ్వు ఫామ్ హౌస్ లో ఎలాంటి పని చేసి టికెట్ తెచ్చుకున్నావో అందరికీ తెలుసు అని అలాంటి నువ్వు కోమటిరెడ్డి గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఇంటి యజమానినే దోచేశారు

వరంగల్, ఏప్రిల్ 27: ప్రియుడు.. అక్కతో కలిసి యజమాని ఇంటికి కన్నం వేసిన పని మనిషి ఉదంతం తాజాగా వెలుగు చూసింది. ఆమె పని చేస్తున్న యజమాని ఇంట్లోనే పని మనిషి కళ్యాణి చోరీకి పాల్పడిందని.. ఆమెకు ప్రియుడు చంటి, అక్క సునీత సహకరించారని వరంగల్ కమిషనరేట్ పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. పని మనిషి సహా ఆమె ప్రియుడు, అక్క నుంచి రూ.38 లక్షల విలువ చేసే బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ మండలం బిల్యానాయక్ తండాకు చెందిన కళ్యాణి హనుమకొండ లోని సంతోష్ నగర్ లో నివాసం ఉంటున్న డాక్టర్ కీసర విక్రమ్ రెడ్డి ఇంట్లో కొంత కాలంగా పని మనిషిగా పని చేస్తుంది. ఇదే సమయంలో నిందితురాలు తన యజమాని ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ఉన్నట్లుగా గుర్తించింది. కళ్యాణికి యజమాని ఇంట్లోని బంగారం పై ఆశ కలిగింది. ఎలాగైనా బంగారాన్ని దొంగిలించాలని ప్రియుడు చంటి, కళ్యాణి అక్క సునితతో కలిసి ప్లాన్ ప్రకారం యజమాని కళ్లు కప్పి 650 గ్రాముల బంగారు అభారణాలను నాలుగు దఫాలుగా చోరీ చేసినట్లుగా వరంగల్ కమిషనర్ తెలిపారు. ఇంట్లో బంగారం మాయం అవుతుండడంతో యజమాని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పని మనిషిపై అనుమానంతో ఆమెను విచారణ చేయగా..

చోరికి పాల్పడినట్లు తేలిందని సీపీ చెప్పారు. ఈ చోరీ మార్చి నెలలో జరిగిందని అన్నారు. దొంగిలించిన బంగారు అభరణాల్లో కొంత భాగం బంగారాన్ని తాకట్టులో పెట్టి కారు కొన్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ముగ్గురు నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా మీడియాకు చెప్పారు.

# చేవెళ్ల మ్యానిఫెస్టో రిలీజ్



హైదరాబాద్, ఏప్రిల్ 27: చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా.. ఆయన చేవెళ్ల ప్రాంతానికి ప్రత్యేకంగా ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించి శుక్రవారం విడుదల చేశారు. తనను గెలిపించడం ద్వారా.. నియోజకవర్గ ప్రజలకు రాబోయే ఐదేళ్లలో చేయనున్న పనులను సంకల్ప పత్రం పేరిట ప్రజల ముందుకు తీసుకొచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలం అజీజ్ నగర్?లోని బీజేపీ కార్యాలయంలో ఆయన ఈ సంకల్ప పత్రాన్ని మీడియాకు వివరించారు. చేవెళ్లను దేశంలో అత్యుత్తమ పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం కోసం ఈ సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రకటించారు.

అత్యంత వైవిధ్యత కలిగిన చేవెళ్ల నియోజకవర్గంలో 29 లక్షల మంది విభిన్న కులాలు, మతాలు, భాషా బేధాలు కలిగిన వారు ఉన్నారని ఆయన చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా తన సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు.ఎంపీగా ఈ ప్రాంతానికి విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కేంద్ర నిధులతో విద్య, వైద్యం కల్పించడంతోపాటు ప్రైవేట్ స్కూలు, ఆసుపత్రిలో విషయంలో నియంత్రణ చర్యలు చేపడతానన్నారు. గోవా తరహాలో కమ్యూనిటీ స్కూల్స్ తీసుకొచ్చి అధిక ఫీజుల భారం లేకుండా చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. చేవెళ్ల ప్రాంత యువతను వేధిస్తున్న అతి ప్రధాన సమస్య నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తానన్నారు. భారీ పెట్టుబడులు తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల్లో శిక్షణను ఇప్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తానన్నారు. తమ గ్రామంలోనే ఉంటూ ఉపాధి పొందే అవకాశాన్ని ఇక్కడ యువకులకు అందిస్తానన్నారు. తాండూరు కందిపప్పుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ తీసుకురావడంలో తానే ముఖ్య పాత్ర పోషించానని ఆయన చెప్పారు. స్థానికంగా పండే పంటలకు అధిక ధరలు దక్కేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన సంకల్ప పత్రంలో పేర్కొన్నారు. చేవెళ్లను నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మిల్లెట్స్ హబ్ గా తీర్చి దిద్దుతానని ఆయన చెప్పారు.

# మల్కాజ్ గిరిలో నువ్వు గెలుస్తావ్..!

హైదరాబాద్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. తరచూ నోరు జారి లేదా తనదైన శైలిలో కామెంట్లు చేసి హైలైట్ అయ్యే ఆయన తాజాగా మరోసారి కూడా అలాగే వ్యవహరించారు. ఈసారి పార్టీ లైన్ దాటి వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. మల్కాజ్ గిరిలో బీజేపీ అభ్యర్థి గెలుస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున అభ్యర్థిగా ఈటల రాజెందర్ ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మల్కాజ్ గిరిలో ఈటల రాజేందర్ గెలుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ఒక ఫంక్షన్ లో ఈ ఆసక్తికర పరిణామం జరిగింది. అదే ఫంక్షన్ కు మల్కాజ్ గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా హాజరయ్యారు. అలా ఆ ఫంక్షన్ లో మల్లారెడ్డి, ఈటల రాజేందర్ కలుసుకున్నారు. ఆప్యాయంగా ఒకరితో మరొకరు ఫోటో దిగారు. అడిగి మరీ ఈటలతో ఫోటో దిగారు.. మల్లారెడ్డి. మల్కాజ్ గిరిలో ఈసారి నువ్వే గెలుస్తున్నవ్ అన్నా.. అంటూ మాట్లాడారు.

“మల్కాజిగిరిలో ఇంకెవరు గెలుస్తారు. నువ్వే గెలుస్తున్నవ్” అంటూ ఈటల రాజేందర్ ను గట్టిగా హత్తుకున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్ వర్గాలను షాక్ కు గురి చేసినట్లు అయింది. ఓవైపు పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక సీట్లు కోసం బీఆర్ఎస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తూ ఉంది. స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగి రోడ్ షోల ద్వారా జనాల్లోకి వెళ్తున్నారు. బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు సాధించుకోవడం కోసం కష్టపడుతుంటే.. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈటల రాజేందర్ తో ఇలా వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది.

మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గంలోనే మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మల్కాజ్ గిరిలో మొతం ఏడు సీట్లు బీఆర్ఎస్ గెలుచుకుంది. అలాంటి చోట బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తారని స్వయంగా మల్లారెడ్డి బహిరంగంగా ప్రకటించడం చర్చనీయాంశమైంది.

అన్నా నువ్వే గెలుస్తున్నావ్! ఈటలతో మాజీ మంత్రి మల్లారెడ్డి

# రక్షణకు భారీగా 91 వేల కోట్ల డాలర్లు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ప్రపంచంలో అన్ని దేశాలు ప్రస్తుతం రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకోసం సైన్యానికి, ఆయుధాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశాలు రక్షణకు ఎంత వ్యయం చేస్తున్నాయో స్టాక్ హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం(సిప్రి) తాజాగా నివేదిక విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం రక్షణ వ్యయంలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఈ దేశం రక్షణ కోసం 91 వేల కోట్ల డాలర్లు వెచ్చిస్తోంది. ఇక 2023 నివేదిక ప్రకారం భారత్ రూ.8,300 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తుంది. మన దేశంలో ప్రపంచంలో రక్షణ వ్యయంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. రెండు, మూడో స్థానాల్లో చైనా, రష్యా నిలిచాయి.ఇక రక్షణ కోసం ప్రపంచ దేశాలు గతేడాది 2,44,300 కోట్ల డాలర్లు వెచ్చించాయని సిప్రి తెలిపింది.

2022తో పోలిస్తే ఆ మొత్తం 6.8% అధికమని పేర్కొంది. 2009 తర్వాత రక్షణ వ్యయం ఒక ఏడాదిలో ఇంత ఎక్కువ పెరగడం ఇదే తొలిసారని వెల్లడించింది. వరుసగా తొమ్మిదో ఏడాది ఈ వ్యయంలో పెరుగుదల నమోదైందని తెలిపింది.ఇక సిప్రి నివేదిక ప్రకారం.. భారత రక్షణ వ్యయం 2022తో పోలిస్తే 2023లో 4.2% పెరిగింది. 2014తో పోలిస్తే అది 44% పెరిగింది. సిబ్బంది, నిర్వహణ వ్యయాల పెరుగుదలే భారత రక్షణ వ్యయం అధికం కావడానికి ప్రధాన కారణం. 2023 నాటి మొత్తం మిలిటరీ బడ్జెట్లో వాటిదే మూడో వంతు వాటా. చైనా, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో.. సాయుధ బలగాల సమర సన్నద్ధతను బలోపేతం చేసుకునేందుకు భారత్ ప్రాధాన్యమిస్తోంది. మిలిటరీ వ్యయంలో దాదాపు 22% బడ్జెట్‌ను రక్షణరంగ కొనుగోళ్లకు కేటాయిస్తోంది. అందులో 75% వాటా దేశీయ కొనుగోళ్లకే వెళ్తుంది.

సిప్రి నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..

- రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఆసియా, ఓషియానా, పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా గతేడాది ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం పెరిగింది.
- అమెరికా రక్షణ వ్యయం 2022తో పోలిస్తే నిరుడు 2.3% పెరిగింది. 2014తో పోలిస్తే ఆదేశ రక్షణ వ్యయంలో పెరుగుదల 9.0%గా ఉంది.
- సైనిక వ్యయం పరంగా ఉక్రెయిన్ గతేడాది ప్రపంచంలో 8వ స్థానంలో నిలిచింది. 2023లో ఈ రంగంపై ఆదేశం అత్యధికంగా ఖర్చు చేసింది. మొత్తం 6,490 కోట్ల డాలర్లు వెచ్చించింది. రష్యా రక్షణ వ్యయంలో ఇది 50 శాతం మాత్రమే.

# కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు

పెద్దపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది అన్నీ ఆగినయి. నీళ్ళు లేక కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పొలాలు మొత్తం ఎండిపోయాయమని పెద్దపల్లి బీ ఆర్ ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గతేడాది ఈ మండలంలో ఒక్క ఎకరా కూడా ఎండిపోలేదు. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారు. కాంగ్రెస్ 120 రోజుల పాలనలో ప్రజలు విసుగు చెందారు. మళ్ళీ బీ ఆర్ ఎస్ రావాలని ప్రతి గ్రామగ్రామాన కోరుకుంటున్నారు. పెద్దపల్లి కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు స్థానికులు కారు.

జూలపల్లి మండలం కుమ్మరి కుంటలో నేను పుట్టాను. బిజెపి కాంగ్రెస్ అభ్యర్థులది పెద్దపల్లి కాదు హైదారాబాద్. వేల కోట్లున్న వివేక్ కుటుంబం పెద్దపల్లి కి చేసింది ఏమి లేదు . వేల కొట్లున్న వివేక్ ఇక్కడ ఒక్క ఫ్యాక్టరీ పెట్టారా. వీకెండ్ నాయకులకు ఓటు వేయవద్దని అన్నారు.

# పాతబస్తీలో వినూత్న ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 27: ఆమె దెబ్బకు పాతబస్తీలో పూనకాలు లోడింగ్ అన్నట్లు మారిపోయింది రాజకీయం. మొన్న మతపరమైన కట్టడంపై బాణం ఎక్కుపెట్టారని ఆరోపణలు వచ్చాయి. తర్వాత పతంగి అంతం చూస్తానంటూ పంతం పట్టారు. గాలి పటం ఎగరేస్తున్నట్టు యాక్షన్ చేసి, దాన్ని కట్ చేసినట్లు చూపించి.. బీజేపీ కేడర్‌లో కాక రేపారు. మాటల కంటే చేతలతోనే మంటలు రేపుతున్నారు. తన హావభావాలతో.. ఓల్డ్ సిటీలో కైట్ ఫైట్‌ని పీక్స్‌కి తీసుకువెళ్లారు. తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం మామూలుగా లేదు. అందులోనూ రాజధాని నగరం హైదరాబాద్ లోని ఓల్డ్ సిటీలో ఎన్నికల ప్రచారం కాకరేపుతోంది. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థులుగా ఇంతవరకు ఎంతమంది పోటీ చేసినా, ప్రచారం చేసినా.. ఆమెకు వచ్చిన క్రేజ్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అంటున్నారు పబ్లిక్. ఆమె నన్ అదర్ దేన్ మాధవీ లత. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగినప్పుడు జనానికి పెద్దగా పరిచయం లేని పేరు. రాజకీయాలకు పూర్తిగా కొత్త ముఖం. అయితే ఇప్పుడు ఆమె పేరు తెలియనివాళ్లు తెలుగు రాష్ట్రాల్లోనే లేరు. ఇక జాతీయ స్థాయిలో కూడా మాధవీలత పేరు మార్మోగిపోతోంది. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మాధవీ లత ఏం చేయగలరు? అది మజ్లిస్ అడ్డా. ఒవైసీ గడ్డ అనుకున్నారు అంతా. అయితే ఇప్పుడు మాధవీలత ప్రచారం పాతబస్తీలో బీజేపీ కేడర్‌కు ఊపు తెస్తోంది. మజ్లిస్ ఎన్నికల గుర్తు పతంగి. దాన్ని చేతులతో ఎగరేసి కట్ చేసినట్లు చూపిస్తున్నారు మాధవీలత. నాకు మాటలు అక్కర్లేదు. చేతలు చాలు అంటూ మాధవీలత చేస్తున్న పొలిటికల్ యాక్షన్‌కు రియాక్షన్ కూడా అంతే తీవ్రంగా వస్తోంది. అయినా తగ్గేదే లా అన్నట్లు మాధవీలత దూసుకుపోతున్నారు. పాతబస్తీలో సరికొత్త రాజకీయ రంగు, రుచి, వాసన జనానికి చూపిస్తున్నారు. ప్రచారంతో పూనకాలు తెప్పిస్తున్న మాధవీలతపై కేసులు కూడా నమోదవుతున్నాయి. ఇక ఒవైసీ బ్రదర్స్ కూడా ఆమె మీద గరం గరం అవుతున్నారు. ఇదే తరుణంలో ఆయన కూడా కైట్ ను మరింత జోష్ గా ఆకాశంలో ఎగురవేస్తున్నట్లు చేతులతో హావభావాలను పలికించారు. ఇలా ఇరువురి మధ్య మాటల తూటాలు కాస్త సైగలతో దూసుకెళ్లిపోతోంది. దీనిని ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారు.

# దుమారం రేపుతున్న నయవంచన పోస్టర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 27: హైదరాబాద్ లోని అనేక బహిరంగ ప్రదేశాల్లో బీజేపీకి వ్యతిరేకంగా బ్యానర్లు వెలిశాయి. వీటిని సామాన్యులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బీజేపీకి వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ చార్జ్ షీట్ రూపంలో వీటిని విడుదల చేసింది. గాంధీభవన్ రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నేతలు ఈ పోస్టర్లను విడుదల చేశారు. ఈ ప్రజా చార్జిషీట్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు మాట్లాడారు. కొద్దిమంది తన స్నేహితులు, క్రోనీ క్యాపిటల్స్ కు దేశ సంపదను కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని భట్టి అన్నారు. జనాభాను కులాలు మతాలుగా విభజించి మతకల్లోలాలు సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని.. ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో ఒక రాష్ట్రంపై మరొక రాష్ట్రం దాడి చేసి సంపదను దోచుకునేదని.. ప్రస్తుతం ఈ దేశంలో మోదీ హయాంలో అదే ధోరణి కొనసాగుతోందని భట్టి ఆరోపించారు.గత పదేళ్లుగా ఈ దేశ ప్రజలను మోదీ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేస్తుందో చూశాం. రాబోయే ఎన్నికల్లో గెలుపొందేందుకు మోసపూరిత హామీలు ఇస్తోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోదీ గతంలో హామీ ఇచ్చారు. కానీ గత పదేళ్లలో ఈ హామీని అమలు చేయలేదు. ప్రపంచ వ్యాప్తంగా పేరుకుపోయిన భారతీయుల నల్లధనాన్ని వెలికి తీసి దేశంలోని పేదవాళ్ల అకౌంట్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ దేశంలో ఏ ఒక్క పేదవాని అకౌంట్లో 15 లక్షలు జమ కాలేదు. పెద్ద నోట్ల రద్దుతో నకిలీ కరెన్సీని అరికడతామని చెప్పారు. పదేళ్లయినా ఈ హామీకి సంబంధించిన సమాచారం కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు.ప్రధాని మోదీ తన కొద్దిమంది క్రోనీ క్యాపిటల్స్ స్నేహితుల కోసం విదేశీ సంపదను ఎలా దోచిపెడుతున్నాడో యువ నేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించి వివరంగా ఈ దేశ ప్రజలకు చాటారు. దేశ సంపదను కొద్దిమందికి కట్టబెట్టాలని చూసే మోదీ ప్రభుత్వం ఓవైపు.. కుల గణన చేసి అధిక శాతం ఉన్న జనాభాకు ఈ దేశ సంపదను పెంచాలని రాహుల్ గాంధీ మరోవైపు ఈ ఎన్నికల్లో పోరాటం చేస్తున్నారు” అని భట్టి తెలిపారు.రాజ్యాంగం, లౌకికవాదం, ఈ దేశ సంపదను కాపాడేందుకు రాహుల్ గాంధీ నిత్యం ప్రజల్లో తిరుగుతున్నారని భట్టి తెలిపారు. లౌకికవాదం ప్రజాస్వామ్యం ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు మీడియా ముందుకు రావాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. చార్జ్ షీట్ లో పేర్కొన్న ప్రతి విషయాన్ని ప్రతి పౌరునికి ఇంటికి చేరే విధంగా కాంగ్రెస్ సైన్యం కృషి చేయాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

# గన్‌పార్క్‌కు చేరిన రుణమాఫీ రాజకీయం

రాజీనామాకు రావాలని రేవంత్‌కు హరీష్ సవాల్

హైదరాబాద్, ఏప్రిల్ 27: తెలంగాణలో ఓ వైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అస్త్రంగా మలుచుకొని లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నాయి. ఆరు హామీలతోపాటు రైతు రుణమాఫీ, రైతు బంధు పథకాల అమలు తీరుపై విమర్శలు చేస్తున్నాయి. కేవలం తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నమ్ముతున్న బీఆర్ఎస్... వాటిపైనే ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి వాటిపైనే ప్రశ్నలు సంధిస్తోంది. అందులో ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. అధినేత నుంచి సోషల్ మీడియా ఫాలోవర్ వరకు రైతుల సమస్యలనే ప్రధాన అస్త్రంగా చేసుకొని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి సభలో చెప్పినట్టు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తూ వచ్చారు. ఈ మధ్య జరిగిన ఓ సభలో వీటికి సమాధానంగా రేవంత్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆగస్టు కచ్చితంగా రుణ మాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. అలా చేస్తే బీఆర్ఎస్ నేతలు ముఖ్యంగా హరీష్ రాజకీయల నుంచి తప్పుకుంటాలా అని సవాల్ చేశారు. ఇలా మొదలైన యుద్ధం ఇప్పుడు పీక్‌కు చేరుకుంది. ఒకేసారి రుణ మాఫీ చేస్తే తాను రాజీనామా చేయడమే కాకుండా రాజకీయాల నుంచే తప్పుకుంటానని హరీష్ సవాల్ చేశారు అలాగనే గన్‌పార్క్ వద్ద ప్రమాణ చేస్తానని... రేవంత్ కూడా రావాలని పిలుపునిచ్చారు. అన్నట్టుగానే ఈ ఉదయం హరీష్ రావు గన్ పార్క్ వద్దకు రాజీనామా పత్రంతో వచ్చారు. రాజీనామా పత్రంతో గన్ పార్క్ వద్దకు హరీష్‌రావు తన అనుచర గణంతో చేరుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు కూడా అక్కడకు చేరుకున్నాయి. అయితే ఆయన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన్ని తప్పి పంపించారు. పోలీసుల జోక్యం చేసుకోవడంతో కాసేపు గన్ పార్క్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్ పార్క్ వద్ద మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు... రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని అన్నారు. రేవంత్ రాలేని పక్షంలో తన సిబ్బందితోనైనా రాజీనామా పత్రాన్ని పంపించాలని సూచించారు. అందరి ముందు ఇద్దరి రాజీనామా పత్రాలను పెడతామని... అన్న మాట ప్రకారం ఆగస్టు 15 లోపు ఏక కాలంలో ప్రతి రైతుకి ఉన్న రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేయాలన్నారు. లేకుంటే రాజీనామాలు ఆమోదించుకొని రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందని ఇప్పుడు రుణ మాఫీ అంటూ మరో కొత్త మోసానికి తెరలేపిందన్నారు హరీష్. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తమకు రాజీనామాలు లెక్క కాదన్నారు. ఆ రైతుల రుణమాఫీ కోసం రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని... రేవంత్ రెడ్డి సిద్ధమా కాదా అనేది తేలాలన్నారు.

# టెట్ పై మళ్లీ గందరగోళం

హైదరాబాద్, ఏప్రిల్ 27: తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ 2024) ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన తేదీలు కూడా ఇప్పటికే విద్యాశాఖ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈసారి ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ పేర్కొంది. ఇక జూన్ 12న టెట్ 2024 ఫలితాలు కూడా ప్రకటిస్తామని షెడ్యూల్‌లో పేర్కొంది. దీంతో నిరుద్యోగులు టెట్ ప్రిపరేషన్‌లో మునిగిపోయారు. అయితే సార్వత్రిక ఎన్నికల గండం గడిచినా.. మ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం టెట్ పరీక్షపై పడుతుందేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం (ఏప్రిల్ 25) విడుదలైంది. మే 27న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నట్లు షెడ్యూల్ పేర్కొంది. ఈ క్రమంలో మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ప్రకటించడంతో అసలు ఆయా తేదీల్లో పరీక్షలు ఇంటాయో.. లేదోనని అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు.మే 27న పోలింగ్ కాబట్టి ఆ రోజు ఆయా జిల్లాల్లో సాధారణ సెలవుగా ప్రకటిస్తారు. టెట్ పరీక్షకు హాజరయ్యేవారంతా పట్టభద్రులు కావడంతో వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే టెట్ పరీక్షల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పాఠశాల విద్యాశాఖ తర్జనభర్జనలు పడుతుంది. తెలంగాణ టెట్ పరీక్షలు మే 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తామని చెప్పినప్పటికీ ఏ తేదీన ఏ పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తామనే విషయం మాత్రం ఇప్పటివరకు విద్యాశాఖ వెల్లడించలేదు. ఉప ఎన్నికల నేపథ్యంలో పేపర్ల వారీగా పరీక్షల నిర్వహణ తేదీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఆ ప్రకారంగా పోలింగ్ రోజున పరీక్షలు జరపకుండా మిగతా రోజుల్లో యథావిధిగా జరిగేలా షెడ్యూల్ రూపొందించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జయప్రదం చేయండి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు కార్మిక వర్గానికి పిలుపు

కోరుట్ల: 138 వ ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే) ను కార్మిక వర్గ శ్రేణులు జిల్లాలో కార్మిక అడ్డాల వద్ద ఘనంగా అరుణ పతాకం ఎగురవేసి ఉత్సాహం జరపాలని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపు నిచ్చారు. కొరుట్ల డివిజన్ కేంద్రంలో కార్మికులతో మేడే ఉత్సవ గోడ పత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ 1920లో పురుడు పోసుకోని కార్మిక చట్టాల కోసం నిరంతరం పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు .ఫలితమే 8 గంటల పని దినమైనదని అన్నారు.. బ్రిటిష్ పరిపాలన నుండి దేశ స్వతం త్రం కోసం పోరాడింద న్నారు. త్యాగాలు చేసి సాధించు కున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించిన బిజెపి ప్రభుత్వ ను గద్దె దింపాల న్నారు..2024 పార్లమెంటు ఎన్నికలలో కార్మిక సంఘాలు ప్రజలను చైతన్య పరిచి ఇండియా కూటమిని గెలిపిం చాలని అన్నారు...అనేకసార్లు దేశవ్యాప్త సమ్మెలు చేసిన కార్మిక వర్గానికి మేలు జరిగింది లేదని ప్రధాన కార్మిక చట్టాలను పునరుద్దించాలని కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఈఎస్ఐ, పిఎఫ్ బీమా పెన్షన్ సౌకర్యంతో పాటు పేదలకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు..

# 'ఆ ఒక్కటీ అడక్కు' అందరూ కనెక్ట్ అయ్యే కథ




కామెడీ, డ్రామా, ఫ్యామిలీ ఎమోషన్స్.. అన్నీ ఎలిమెంట్స్ అద్భుతంగా వుంటాయి. ప్రేక్షకులు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు: నిర్మాత రాజీవ్ చిలక

కామెడీ కింగ్ అల్లరి నరేష్ ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' తో రాబోతున్నారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా నటిస్తున్నారు. అల్లరి నరేష్ చాలా కాలం తర్వాత చేస్తున్న కామెడీ ఎంటర్ టైనర్ కావడంతో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ సినిమా టీజర్, ట్రైలర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. మే 3న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత రాజీవ్ చిలక విలేకరులు సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు.

'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాని నిర్మించడానికి మిమ్మల్ని ఆకర్షించిన అంశాలు ఏమిటి?

-సినిమాలు నిర్మించాలనే దీర్ఘకాలిక ప్రణాళికతో పరిశ్రమలోకి వచ్చాను. మంచి కథ కోసం చూస్తున్నపుడు దర్శకుడు మల్లి ఈ కథ చెప్పారు. పెళ్లి అనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. ఈ కథలో కామెడీ, ఎంటర్ టైన్మెంట్, ఎమోషన్స్, ఫ్యామిలీ ఇలా అన్ని ఎలిమెంట్స్ వున్నాయి. ఈ జోనర్ సినిమా మా మొదటి సినిమాగా సెట్ అవుతుందని భావించాం.

యానిమేషన్ రంగంలో చాలా కాలంగా వున్నారు కదా.. సినిమా రంగంలోకి రావడానికి ఇంత కాలం ఎందుకు పట్టింది?

-యానిమేషన్ రంగం చాలా కష్టంతో కూడుకున్నది. ముందు కంపెనీని సుస్థిరం చేసే దిశగా పని చేశాం. మా దగ్గర దాదాపు ఎనిమిది వందల మంది ఉద్యోగులు పని చేస్తారు. వారందరికీ జీతాలు ఇవ్వడం మామూలు విషయం కాదు. అయితే సినిమాలు చేయాలని ఎప్పటినుంచో వుంది. దాదాపు ఆరు యానిమేషన్ చిత్రాలు చేశాం. కంపెనీ స్థిరపడిన తర్వాత సినిమాల్లోకి రావాలని భావించాం. ఈ క్రమంలో కొంత సమయం పట్టింది. ఇకపై వరుసగా సినిమాలని నిర్మిస్తాం.

చిలక ప్రొడక్షన్స్ బ్యానర్ గురించి ?

-నా పూర్తి పేరు రాజీవ్ చిలకలపూడి. 2018లో పేరుని రాజీవ్ చిలక అని కుదించాను. ఆ పేరు బాగా కలిసొచ్చింది. ఛోటా భీమ్ పెద్ద హిట్ అయ్యింది. బ్యానర్ కి ఏం పేరు పెట్టాలనే ప్రశ్న వచ్చినప్పుడు చాలా పేర్లు సూచనలుగా వచ్చాయి. అయితే చిలక పేరు పాజిటివ్ గా వుందని అదే పేరుతో చిలక ప్రొడక్షన్స్ ని ప్రారంభించడం జరిగింది.

ఈ కథ విన్నాకా మొదట నరేష్ గారినే అనుకున్నారా?

-ఫస్ట్ అల్లరి నరేష్ గారినే అనుకున్నాం. ఈ కథ విన్నాక మొదట మైండ్ లోకి వచ్చిన రాజేంద్రప్రసాద్ గారు. యంగ్ గా వుంటే ఆయన పర్ఫెక్ట్. ఇప్పుడైతే ఈ కథ నరేష్ గారికే యాప్ట్. నరేష్ గారికి ఈ కథ చాలా నచ్చింది. మేము కథ చెప్పినపుడు ఆయన రెండు సినిమాలతో బిజీగా వున్నారు. ఆయన కోసం వెయిట్ చేసి తీశాం.

మీ మొదటి సినిమాకే పెళ్లి సబ్జెక్ట్ ని ఎంచుకోవడానికి కారణం ?

-ఇది అందరూ రిలేట్ అయ్యే సబ్జెక్ట్. రిలేట్ చేసుకునే ప్రాబ్లం. పెళ్లి అనేది నేటి రోజుల్లో తన ఒక్కడికే సమస్య, తనకే పెళ్లి కావడం లేదనే ధోరణితో చాలా మంది మానసికంగా క్రుంగుబాటుకి గురౌతున్నారు. ఈ రోజుల్లో సెటిల్ అవ్వడం కంటే పెళ్లి అవ్వడం పెద్ద టాస్క్ గా మారింది.

ఒకప్పుడు బంధవులు, చుట్టాలు చుట్టుపక్కల ఉంటూ వాళ్ళే పెళ్లి సంబధాలు చూసే వారు. కానీ ఇప్పుడు రోజులు మారిపోయాయి. ఒకొక్కరూ ఒకొక్క రాష్ట్రంలో, దేశంలో వుంటున్నారు. పెళ్లి కోసం వెబ్ సైట్స్ పై ఆధారపడుతున్నారు. మ్యాట్రీమోనీ సైట్స్ ద్వారానే లక్షల్లో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. పైగా ఇందులో ఒకరిగురించి ఒకరికి తెలీయదు కూడా. జీవితానికి సంబధించిన పెద్ద నిర్ణయాన్ని ఇలా తీసుకుంటున్న పరిస్థితి వుంది. ఇది నేడు యువత ఎదుర్కొంటున్న సమస్య. అందరూ కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్. ఈ కథ చాలా వినోదాత్మకంగా చెప్పాం. కామెడీ, డ్రామా, హ్యుమర్ , సాంగ్స్ ఇలా అన్నీ ఎలిమెంట్స్ అద్భుతంగా వచ్చాయి.

'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ గురించి ?

-కొన్ని టైటిల్స్ అనుకున్నాం కానీ సరిగ్గా సెట్ కాలేదు. అలాంటి సమయంలో నరేష్ గారే 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ సూచించారు. నిజానికి ఈ కథకు యాప్ట్ టైటిల్ ఇది. ఇందులో హీరోని అందరూ పెళ్లి ఎప్పుడని అడుగుతుంటారు. దీంతో ఇరిటేషన్ లో హీరో పలికే సహజమైన డైలాగ్ 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ టైటిల్ పెట్టడం పెద్ద బాధ్యత. నరేష్ నాన్నగారి క్లాసిక్ సినిమా అది. నరేష్ గారికి ఇంకా భాద్యత వుంది. కథ, అవుట్ పుట్ అన్నీ చూసుకున్నాక సినిమా టైటిల్ డిసైడ్ చేయమని కోరాం. నరేష్ గారు సినిమా చూసి చాలా హ్యాపీగా ఫీలై టైటిల్ వాడుకోవచ్చని పర్మిషన్ ఇచ్చారు.

ఈ కథలో ట్విస్ట్ లు ఉన్నాయా ?

-ఇందులో కొన్ని ఆసక్తికరమైన ట్విస్ట్ లు వున్నాయి. స్క్రీన్ ప్లే కథలో లీనం చేస్తుంది. ఆద్యంతం ప్రేక్షకులని హోల్డ్ చేస్తుంది.

దర్శకుడిగా మల్లి అంకంను ఎంపిక చేయడానికి కారణం?

-తను చాలా హార్డ్ వర్కింగ్ పర్సన్. దాదాపు ఇరవై ఏళ్ళుగా పరిశ్రమలో వున్నారు. నాకు ముందు నుంచి పరిచయం వుంది. తను అనుకున్న కథని చాలా అద్భుతంగా తీశాడు.

హీరోయిన్ ఫరియా అబ్దుల్లా గురించి ?

-నరేష్ గారు హైట్ ఎక్కువ వుంటారు. నిజానికి ఆయన ఎత్తుకి చాలా మంది హీరోయిన్స్ సరిపోరు. ఆయన హైట్ ని మ్యాచ్ చేయడానికి ఫారియా అయితే బావుంటుందనిపించింది. అలాగే ఫారియా కామెడీ టైమింగ్ కూడా బావుటుంది. ఈ కథ నచ్చి ఫారియా ప్రాజెక్ట్ లోకి వచ్చారు. అలాగే జానీ లీవర్ గారి అమ్మాయి జెమి లివర్ ఇందులో కీలక పాత్రలో కనిపిస్తారు. దీంతో పాటు మురళి శర్మ, వెన్నెల కిషోర్, వైవా హర్ష వీరందరి పాత్రలు వినోదాత్మకంగా వుంటాయి.

గోపిసుందర్ మ్యూజిక్ గురించి ?

-మ్యూజిక్ కు చాలా ప్రాధాన్యత ఇస్తాం. అందుకే గోపి సుందర్ గారిని ఎంపిక చేశాం. సాంగ్స్ చాలా బాగా ఇచ్చారు. నేపథ్య సంగీతంలో ఎమోషన్ అద్భుతంగా పండింది.

యానిమేషన్స్ లో కొత్త ప్రాజెక్ట్స్ ?

-ఛోటా భీమ్ ని రియల్ పిల్లలతో చేయబోతున్నాం. అలాగే డిస్నీలో ఒక యానిమేషన్ షో లాంచ్ కాబోతుంది. అది ఛోటా స్టార్ట్ అఫ్ గా చేస్తున్నాం. చాలా ఫన్ గా వుంటుంది. మే6న లాంచ్ కాబోతుంది.

నిర్మాతగా ఎలాంటి సినిమాలు చేయాలని వుంది ?

-మంచి ఫ్యామిలీ సినిమాలు తీయాలని వుంది. అలాగే ఫాంటసీ, హిస్టారికల్, కామెడీ జోనర్స్ చేయాలని వుంది.

# మెగా మదర్ కొణిదెల అంజనా దేవి లాంచ్ చేసిన ఆర్కే సాగర్, రాఘవ్ ఓంకార్ శశిధర్, క్రియా ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ 'ది100 గ్రిప్పింగ్ టీజర్

మొగలి రేకులు ఫేమ్ ఆర్‌కె సాగర్ అప్ కమింగ్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రియా ఫిల్మ్ కార్ప్, దమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై రమేష్ కరుటూరి, వెంకీ పూశడపు, జె తారక్ రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కి విశేష స్పందన లభించింది. పోస్టర్‌లో ఆర్‌కె సాగర్‌ను విక్రాంత్ ఐపీఎస్‌గా పరిచయం చేశారు. ఈరోజు ఈ సినిమా టీజర్‌ను మెగా మదర్ శ్రీమతి కొణిదెల అంజనా దేవి లాంచ్ చేశారు.

ఐపీఎస్ అధికారి విక్రాంత్ చేసిన తప్పులపై మానవ హక్కుల కమిషన్ విచారించడంతో టీజర్ ప్రారంభమైంది. నగర శివార్లలో కొన్ని సామూహిక హత్యలు జరుగుతాయి. అందులో వారంతా రౌడీ షీటర్లు. పోలీసుల విచారణ జరుగుతోంది. నేరస్థులను ఎదుర్కోవడంలో తనదైన స్టయిల్ కలిగి ఉన్న హీరో తన పద్ధతి గురించి మీడియా లేదా ఇతరులు ఏమనుకుంటున్నారో పట్టించుకోరు. అతను ఉన్నతాధికారుల, మానవ హక్కుల కమిషన్‌కు కూడా భయపడడు.

తనున్న చోట నేరాలను నిర్మూలించడానికి ఎంతకైనా తెగించే నిజాయితీ గల ఐపీఎస్ అధికారి స్వభావాన్ని తెలియజేసేలా టీజర్ ఉంది. ఖీఐ సాగర్ ఖాకీ దుస్తులలో ఫిట్‌గా కనిపించారు. అతని ఫెరోషియస్ పెర్ఫార్మెన్స్ యుఎస్పీ. రాఘవ్ ఓంకార్ శశిధర్ క్యారెక్టర్‌ని అద్భుతంగా ప్రెజెంట్ చేశారు. టీజర్‌ని బట్టి చూస్తే సినిమా గ్రిప్పింగ్ కథనంతో యాక్షన్‌లో ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది.

ఆర్కే సాగర్ సరసన మిషా నారంగ్ నటిస్తున్న ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్యామ్ కె నాయుడు కెమెరామెన్ కాగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్. చిన్నా ప్రొడక్షన్ డిజైనర్. సుధీర్ వర్మ పేరిచర్ల డైలాగ్స్ అందిస్తున్నారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమౌతోంది.

తారాగణం: ఆర్కే సాగర్, మిషా నారంగ్, ధన్య బాలకృష్ణ, గిరిధర్, ఆనంద్, లక్ష్మీ గోపాల్ స్వామి, కళ్యాణి నటరాజన్, బాల కృష్ణ, జయంత్, విష్ణు ప్రియ తదితరులు.

# అధునాతన టెక్నాలజీతో శ్రీ సారథీ స్టూడియోస్ డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్ స్టూడియోలు ప్రారంభం

హైదరాబాద్ లో తెలుగు సినిమాకు ఐకాన్ గా , ఇంకా చెప్పాలంటే మొట్ట మొదటి స్టూడియోగా శ్రీ సారథీ స్టూడియోస్ కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అలనాటి సినిమాలు మొదలుకుని, నేటి సినిమాల వరకు ఎన్నెన్నో సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకున్నవే. మారుతున్న కాలానికి తగట్టు అధునాతన టెక్నాలజీతో అన్ని రకాల హంగులతో, ఈ స్టూడియోస్ ను తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలలోనే అధునాతన డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్ స్టూడియోలను శ్రీ సారథీ స్టూడియోస్ ప్రారంభించింది. కాగా శుక్రవారం ఆహ్లాదభరిత వాతావరణంలో పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ఈ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో డాల్బీ మిక్సింగ్ స్టూడియోను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ప్రారంభించగా, సౌండ్ డిజైన్ స్టూడియోను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర ప్రారంబించారు. ఈ సందర్భంగా శ్రీ సారథీ స్టూడియోస్ చైర్మన్ ఎం.ఎస్ ఆర్.వి. ప్రసాద్ మాట్లాడుతూ, లోగడ ఈ స్టూడియోని మల్టీఫ్లెక్స్ థియేటర్స్ గా మార్చాలన్న ఆలోచన చేసి, ఆ తర్వాత విరమించుకున్నాం. సినీ స్టూడియోస్ గానే కొనసాగించాలని నిర్ణయించుకున్న అనంతరం షూటింగులకు కావలసిన అన్ని రకాల హంగులు, అలాగే నేటి కాలానికి పోటీపడేవిధంగా పోస్ట్ ప్రొడక్షన్స్ కు కావలసిన అధునాతన టెక్నాలజీని మా స్టూడియోలో అందుబాటులోకి తీసుకునివచ్చాం. మేము ఈ రోజు ఆరంభించిన డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్ లు చాలా చాలా అధునాతనమైనవి. ఈ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ మా స్టూడియోలో మొదలైన మొదటి సినిమా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న క్రేజీ సినిమా "కల్కి" అని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాం" అని అన్నారు

శ్రీ సారథీ స్టూడియోస్ డైరెక్టర్ కె.వి.రావు మాట్లాడుతూ, మా స్టూడియోలో షూటింగ్ ప్రారంభిస్తే,, పోస్ట్ ప్రొడక్షన్స్ తో సహా సినిమా మొదటి కాపీని సిద్ధం చేసుకునేంతవరకు కావలసిన ఎక్విప్ మెంట్ అంతా ఉందని అన్నారు. సినిమా అనగానే సౌండింగ్ కు ఉన్న ప్రాధాన్యం అంతాఇంతా కాదు. అందుకే అధునాతన టెక్నాలజీని మేము ప్రవేశపెట్టామని చెప్పారు.



ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు కె.ఎస్.రామారావు, కె.ఎల్.నారాయణ, రచయిత విజయేంద్రప్రసాద్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్, సంగీత దర్శకుడు భీమ్స్, స్టూడియో జనరల్ మేనేజర్ బాలచంద్ర, ఇంకా పలువురు సినీ ప్రముఖులు, మీడియా ప్రముఖులు పాల్గొని, స్టూడియో యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.

# మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తున్న సత్యదేవ్ 'కృష్ణమ్మ'.. మే 10న గ్రాండ్ రిలీజ్




సత్యదేవ్.. హీరోగా, వెర్సటైల్ యాక్టర్‌గా తనకుంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. పక్కా కమర్షియల్ సినిమా అయినా, ఎక్స్ పెరిమెంటల్ మూవీ అయినా సత్యదేవ్ తనదైన యాక్టింగ్‌తో అలరిస్తుంటారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా, ఒక్కో మెట్టూ ఎక్కుతూ తానేంటో ప్రూవ్ చేసుకుంటున్నారు హీరో సత్యదేవ్. ఆయన నటించిన లేటెస్ట్ సినిమా 'కృష్ణమ్మ'. రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం మే 10న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. వి.వి.గోపాలకృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ పతాకంపై కృష్ణ కొమ్మలపాటి ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ సినిమాను విడుదల చేస్తున్నాయి.

'కృష్ణమ్మ' సినిమాలో సత్యదేవ్‌కి జోడీగా అతీరారాజ్ నటించారు. లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘుకుంచె, నందగోపాల్ కీలక పాత్రల్లో నటించారు.ఇప్పటికే విడుదలైన 'కృష్ణమ్మ' మూవీ టీజర్, టైటిల్ సాంగ్, ఏమవుతుందో మనలో.., దుర్గమ్మ అనే లిరికల్ సాంగ్స్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. సత్యదేవ్‌ని సరికొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రంగా 'కృష్ణమ్మ' నిలవనుంది. ఈ సినిమాకు కాల భైరవ సంగీతాన్ని, సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు.

నటీనటులు:

సత్యదేవ్, అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్, కృష్ణ, అర్చనా అయ్యర్ తదితరులు

# తమన్నా భాటియా, అశోక్ తేజ, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ హై బడ్జెట్ మల్టీ-లింగ్వల్ ఫిల్మ్ 'ఒదెల 2' రెండవ షెడ్యూల్ ప్రారంభం, గూస్‌బంప్స్ తెప్పిస్తున్న వర్కింగ్ వీడియో

మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఒదెల 2'. బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ సంపత్ నంది క్రియేటర్ గా, ఓదెల రైల్వే స్టేషన్ ఫేమ్ అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నారు. మహా శివరాత్రి నాడు విడుదలైన 'భైరవి' నాగ సాధువుగా సూపర్ స్టార్ తమన్నా భాటియా ఫస్ట్ లుక్ పోస్టర్ తో సినిమాపై హైప్, అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ మల్టీ లాంగ్వేజ్ సూపర్ నేచురల్ విజువల్ వండర్ భారతదేశంలోని వివిధ అద్భుతమైన ప్రదేశాలలో తన మొదటి షూట్ షెడ్యూల్‌ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. మహాదేవ్ పరమశివుని దివ్య ఆశీస్సులతో ఆయన పవిత్ర నివాసం వారణాసిలో మార్చిలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ప్రారంభ షెడ్యూల్‌లో వారణాసి, హైదరాబాద్, భూధాన్ పోచంపల్లి, పోతారం, టంగటూర్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపారు. రెండవ షూట్ షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాదు, చుట్టుపక్కల ప్రాంతాలలో జరుగుతోందని చిత్ర బృందం అనౌన్స్ చేసింది. ఈ షెడ్యూల్ 20-25 రోజుల పాటు జరుగుతుంది. సినిమాలోని ప్రధాన తారాగణం, కీలక సహాయ నటీనటులతో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తోంది యూనిట్. ఈ చిత్రంలో తమన్నా భాటియాతో కలిసి హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ఇతర ప్రముఖ ప్రతిభావంతులతో సహా నటీనటుల నటిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ అద్భుతమైన స్కోర్‌తో తమన్నా పాత్రలోకి మారడాన్ని చూపించే వర్కింగ్ వీడియో గూస్‌బంప్‌లను అందిస్తుంది. ఓదెల మల్లన్న ఆశీస్సులతో రెండవ షూట్ షెడ్యూల్ జరుగుతుండగా, గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించే "ఒదెల 2" మేకింగ్ గురించి రెగ్యులర్ అప్‌డేట్‌లు చూస్తుంటే సినిమా విజువల్ వండర్ గా ఉండబోతుందని అర్థమౌతోంది. ప్రతి యుగంలో దేవుడు తన ప్రజలను రక్షించడానికి చెడును ఎలా గెలుస్తాడో చూపిస్తూ అనే కథాంశంతో "ఓదెల" ఒక సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అవుతుందని హామీ ఇచ్చింది. ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఉత్కంఠభరితమైన విజువల్స్, అద్భుతమైన సన్నివేశాలు, పవర్‌హౌస్ పెర్ఫార్మెన్స్ లతో వుండబోతుంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సౌందర్‌రాజన్ మొదటి ఎడిషన్ 'ఒడెలా రైల్వే స్టేషన్' తర్వాత మాఓదెల ఫ్రాంచైజీకి తిరిగి వచ్చారు. రాజీవ్ నాయర్ ఆర్ట్ డైరెక్టర్. ఈ చిత్రం చుట్టూ ఉన్న అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే ఈ చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ సినిమా జాతీయ స్థాయిలో విడుదల కానుంది. తారాగణం: తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి,

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**